


లక్ష్యం.. శత శాతం!

- పది విద్యార్థులకు సకల సౌకర్యాలు
- పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో రామారావు

"పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యార్థుల్లో నిగూఢంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసి వారిని చక్కని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు నూతన ప్రణాళికలను అనుసరిస్తూ ఉపాధ్యాయులను సమాయత్తం చేశాం. భయం వీడి ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా సకల ఏర్పాట్లు చేశాం' అని జిల్లా విద్యాశాఖాధికారి పీజేవీ.రామారావు స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న తీరు, నిర్వహణకు చేపడుతున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..



ఆత్మకూరులోని బీసీ బాలికల హాస్టల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 34,078 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికోసంగా జిల్లావ్యాప్తంగా కేంద్రాలను పరిశీలించి ఏ సెంటర్లు 94, బీ సెంటర్లు 57, సీ సెంటర్లు 25 కలిపి 176 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాము. వీటిలో 14 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అందులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. అలాగే 48 స్టోరేజీ పాయింట్లలో ప్రశ్నపత్రాలను ఉంచడంతో పాటు ఫ్లయింగ్‌స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌లను సిద్ధం చేస్తున్నాము.

● పక్కా ప్రణాళికతో ముందుకు..

ఈ ఏడాది పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికతో చదివిస్తున్నాం. ప్రత్యేకంగా పురోగమి పేరుతో స్టడీ మెటీరియల్ తయారు చేసి ప్రతి విద్యార్థికి అందచేశాం. ప్రతిరోజూ ఏదో ఒక పరీక్ష నిర్వహించి అభ్యసనా సామర్థ్యాలను పెంపొందిస్తున్నాము. వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి సిలబస్‌ను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. అలాగే పరీక్ష కేంద్రాలకు అనుగుణంగా 16 నుంచి 20 మంది విద్యార్థులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నాము. అన్ని పాఠశాలలను తనిఖీ చేసి అవసరమైన చోట బెంచీలు ఉండేలా హెచ్ఎంలు చర్యలు చేపడుతున్నారు.

● ప్రశ్నపత్రంపై కోడ్

టెన్త్ ప్రశ్నపత్రంపై ఈసారి కోడ్ అమలు చేస్తున్నాం. దీనివల్ల ప్రశ్న పత్రం లీక్ కావడం వంటి సంఘటనలు ఉండవు. ఒకవేళ ఏదైనా తప్పు జరిగినా అది ఎక్కడ జరిగిందో తెలిసిపోతుంది. అలాగే మాస్ కాపీయింగ్ నివారణకు ఇది దోహద పడుతుంది. పరీక్ష సమయంలో విద్యార్థులకు అందజేసే 24 పేజీల బుక్‌లెట్‌లోనే సమాధానాలు రాయాలి. ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణలోనే విద్యార్థులకు పబ్లిక్‌పై అవగాహన కలిగింది. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడల్లా టెన్త్ విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్నాము. ఎఫ్ఏ, ఎస్ఏలలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను ప్రధాన పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాము. సబ్జెక్ట్ నిపుణులు ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.



● అన్ని శాఖల అధికారులతో సమన్వయం

విద్యా, రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్, వైద్యం, పోస్టల్ తదితర శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నాము. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గదిలో ఫ్యాన్, మంచినీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము. గదిలో గాలి వెలుతురు ఉండేలా చూడటంతోపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాము. మెడికల్ కిట్లతో ఏఎన్ఎంలనూ కేంద్రాల వద్ద నియమిస్తున్నాము.

● విద్యార్థులూ కంగారు పడొద్దు!

విద్యార్థులు ఎలాంటి ఆందోళన, కంగారు పడకుండా ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలకు హాజరవ్వాలి. పరీక్షల భయం వీడి పాఠశాలల్లో ప్రీ పబ్లిక్ పరీక్షలకు హాజరైన రీతిలోనే ప్రధాన పరీక్షలకూ హాజరు కావాలి. అయితే ఇవి కీలకమైన పరీక్షలు కనుక పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరి వారికి కేటాయించిన గదుల్లో కూర్చోవాలి. మెరుగైన ఫలితాలు సాధించేందుకు సంసిద్ధం కావాలి.

● మాస్‌కాపీయింగ్ కట్టడికి

జంబ్లింగ్ విధానంలో జరుగుతున్న పరీక్షల్లో విద్యార్థులు చూచిరాతలకు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు దృష్టి సారిస్తారు. గదిలో తక్కువమంది ఉంటారు కాబట్టి కాపీయింగ్‌కు పాల్పడే అవకాశాలు ఉండవు. దీనికోసంగా ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి హెచ్ఎంలకు సూచనలు జారీ చేశాం. చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇస్తున్నాము. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే గతంలో ఫోన్ అనుమతి ఉండేది. ప్రస్తుతం సీఎస్‌కు కూడా అనుమతి లేదు. 2వేల మంది ఇన్విజిలేటర్లతో పాటు 176 మంది సీఎస్‌లు, 176 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాము. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

- నెల్లూరు (విద్య)

ఇంటర్వ్యూ

● పురుషామృగ వాహనంపై త్రినేత్రుడు



నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు, చప్పర ఉత్సవం జరిగాయి. సాయంత్రం విశేష పూలంగిసేవ, పూజలు చేశారు. పురుషామృగ వాహనంపై ఆదిదేవుడు దర్శనమిచ్చాడు. ఈ ఉత్సవాన్ని ఆలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, ధర్మకర్తలు, ఉభయ కర్తలు, ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు. గురువారం ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి శేషవాహన సేవ జరగనున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)

నేడు ప్రభుత్వ వైద్యకళాశాల స్నాతకోత్సవం

● పాల్గొననున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం, మార్చి 5 : మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం నెల్లూరు నగరంలో జరిగే ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారు. 7వ తేదీ ఉదయం 11.30 గంటలకు వరిష్ఠ రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని నెల్లూరు కస్తూరిదేవి హైస్కూల్ ప్రాంగణంలోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌భవన్‌లో ఆవిష్కరిస్తారు. అదేరోజు సాయంత్రం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే మహిళకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారు. 8వ తేదీ రాత్రి 8 గంటలకు శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి కాకినాడకు వెళ్తారు.

19 నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

● తూ తూ మంత్రంగా ఉభయకర్తల సమావేశం

చిట్రగుంట, మార్చి 5: బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. ఎంతో ఆర్భాటంగా జరిగే ఈ ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి భక్తజనం తరలివస్తుంది. అలాంటి ఉత్సవాలపై పాలక వర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏర్పాట్లు తదితర అంశాలపై సోమవారం సాయంత్రం ఉభయకర్తలతో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించి మమ అనిపించారు. ఆలయ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి అందుబాటులో లేని కారణంగా ఈవో రాధాకృష్ణ, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఉత్సవాలకు 13 రోజులే గడువున్నా ఇప్పటిదాకా కరపత్రాలు, గోడపత్రికలు పంపిణీ చేయక పోవడంపైనా భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మద్దతివ్వండి.. లేదు పోటీలో ఉంటా!

● మంత్రి కాకాణికి తేల్చి చెప్పిన విష్ణు

అల్లూరు, మార్చి 5 : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మంగళవారం రాత్రి అల్లూరులోని విష్ణు నివాసంలో కలిసి చర్చించారు. అరగంటసేపు వారిద్దరూ ఏకాంతంగా చర్చించారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి ఎవరితో మాట్లాడకుండా వెళ్లిపోయారు. విలేకరులతో విష్ణు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మాట మార్చారన్నారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్సీ ఇస్తానని మంత్రి కాకాణి తన వద్ద ప్రస్తావించారని, ఇందుకు తాను పోటీలో ఉండటమే తుది నిర్ణయంగా తన అభిప్రాయాన్ని చెప్పానన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బుధవారం సమాధానం ఇస్తానని కాకాణి చెప్పినట్లు విష్ణు తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడిన పదవులు తప్ప దొడ్డిదారిన తీసుకునే ఈ పదవులు తనకు వద్దని ఆయన కరాఖండీగా చెప్పారు. అనంతరాజు బాల కృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, విష్ణు అభిమానులు తదితరులు ఉన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

వైసీపీలో గుర్తింపు ఏదీ!?


- పార్టీలో కొనసాగడంపై త్వరలో నిర్ణయం
- కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు

కావలి, మార్చి 5 : '2014లో అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు మేరకు వైసీపీలో చేరి కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేశాను. దాదాపు పదేళ్లు గడుస్తున్నా పార్టీలో నాకు గుర్తింపు ఇవ్వలేదు. ఆత్మీయుల అభిప్రాయం మేరకు వైసీపీలో కొనసాగాలా!? లేదా టీడీపీలో చేరాలా అనే దానిపై త్వరలో నా నిర్ణయం చెబుతా'నని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కావలి ఐడీఎస్ఎంటీ ప్లాట్లలోని తన కార్యాలయంలో మంగళవారం కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని తన అనుచరులతో వంటేరు సమావేశమయ్యారు. వైసీపీ రాజకీయ సలహాదారులుగా కొనసాగుతున్న వంటేరు తన అనుచరులతో సమావేశం కావడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. తాను కావలి ఎమ్మెల్యేగా పని చేసినపుడు చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఆత్మీయుల సలహా మేరకు త్వరలో తన నిర్ణయం వెల్లడిస్తానని ఆయన అన్నారు. కాగా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితోపాటు కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డితో ఆయన టచ్‌లో ఉన్నట్టు సమాచారం.

12న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

నెల్లూరు (జడ్పీ), మార్చి 5 : జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి ఈ సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రణాళిక, ఆర్థిక విషయాలు, పనులు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

'సోమశిల'లో 15.239 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి జలాశయంలో 15.239 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

100.36 శాతం పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం), మార్చి 5 : పల్స్‌పోలియో కార్య క్రమం లక్ష్యాన్ని మించి విజయవంత మైంది. మంగళవారం 1485 మందికి పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాప్తం గా 2,93,536 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వే యాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించగా 100.36 శాతం పూర్తిచేసి 2,94,575 మందికి చుక్కల మందు వేశారు. మొదటి రోజు ఆదివారం 98.02 శాతం, సోమవారం 1.83 శాతం, మంగళవారం 0.51 శాతం పోలియో వ్యాక్సిన్ పం పిణీ జరిగింది.

స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలు గుర్తించండి

● రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ రత్నకుమారి



మాట్లాడుతున్న రత్నకుమారి

నెల్లూరు (సిటీ), మార్చి 5 : స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలను గుర్తించి ఆ మేరకు నివేదికలు తయారు చేయాలని ఏపీ 5వ ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ ఎస్ రత్నకుమారి ఆదేశించారు. మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాల యంలో విభాగాధిపతులతో ఆమె సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి, జవాబుదారీతనం పెంచడానికి, ప్రణా ళికేతర వ్యయాన్ని తీర్చడానికి తగు అంచనాలను సూచించాలన్నారు. స్థానికంగా ఆర్థికపరమైన వ్యయాలను నివేదికల్లో పేర్కొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కృపాకర్‌రావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రాక.. శుద్ధిజలం అందక!

- మూత పడుతున్న మదర్‌ప్లాంట్లు
- కాంట్రాక్టర్‌కు రూ.4కోట్ల వరకు పెండింగ్
- ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో తీరని దాహం



నిరుపయోగంగా ఉన్న ఆర్వీయూ ట్యాంకులు

ఉదయగిరి రూరల్, మార్చి 5 : జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో తిండి, ఉపాధి కొరతే కాదు. తాగునీటికీ తిప్పలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి ఫ్లోరైడ్ సమస్యతో ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక గ్రామాలు సతమతమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలకు శుద్ధిజలం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు అప్పట్లోనే 90 శాతం పూర్తి చేసుకున్నాయి. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ సుజల స్రవంతిగా పేరు మార్చింది. పథకం పనులు పూర్తి చేసి అరకొరగా నీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. అయితే, పనులు చేసిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ.4 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉండటంతో పథకం నిర్వహణకు చేతులెత్తా శారు. దీంతో పథకం మూలకు చేరింది. కోట్ల రూపాయలు విలువ చేసే పరికరాలు, వాహనాలు, ఆర్వీయూ యూనిట్‌లు నిరుపయోగంగా మారాయి.



ఉదయగిరి : కుర్రపల్లిలో మూతపడ్డ వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్

● రూ.19.81 కోట్లతో

ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని అన్ని పంచాయతీలకు శుద్ధిజలం అందించేందుకు సుమారు 19.81 కోట్లతో పథకాన్ని ప్రారంభించారు. ప్రతి మండలంలో మదర్‌ప్లాంట్ నిర్మించి బోర్లు సైతం ఏర్పాటు చేశారు. మదర్‌ప్లాంట్ నుంచి పంచాయతీలో ఏర్పాటు చేసిన రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఆర్వీయూ)లకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ప్రణాళిక రూపొం దించారు. నీటి సరఫరాకు సంబంధించి ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు పొందిన వ్యక్తి కొన్ని రోజుల పాటు ఆయా మండలాల్లో అరకొరగా ఆర్వీయూలకు నీటిని సర ఫరా చేశారు. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండ టంతో ప్రస్తుతం మదర్‌ప్లాంట్‌లు మూతప డుతున్నాయి. ఉదయగిరి మండలంలో కుర్రపల్లి గ్రామ పిల్లాపేరు వాగు సమీపంలో సుమారు గంటకు 10 వేల లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే మదర్ ప్లాంట్ మూతపడింది. దీంతో మండలంలో పలు గ్రామాలకు శుద్ధిజలం సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ మూతపడడంతో అందులో పని చేస్తున్న సిబ్బంది ఉపాధి కోల్పోయారు.

పేదలపై నీటిభారం

పథకం లక్ష్యం నీరుగారడంతో ప్రజలు శుద్ధిజలం కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది. పథకం పని చేస్తుంటే రూ.5లకే 20 లీటర్ల శుద్ధిజలం అందేది. శుద్ధిజలం అందుబాటులో లేకపోవడంతో బయట 20 లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి 15 చొప్పున కొనుగోలు చేయాల్సి ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి శుద్ధిజలం అందేలా చర్యలు చేపట్టాలని మెట్టప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటా 'సోలార్' వెలుగులు

- విద్యుత్ వినియోగదారుల కోసం కేంద్ర పథకం
- 150 యూనిట్లు వాడుతున్న వారికి అవకాశం
- రూ.30వేల నుంచి 78వేల వరకు సబ్సిడీ



నెల్లూరు (జడ్పీ), మార్చి 5 : సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలోలా కాకుండా పేద కుటుంబాల నుంచి ప్రతి కుటుంబం సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక సబ్సిడీ కూడా అందించనున్నారు. గతంలో భారీ భవంతులు ఉంటే తప్ప సోలార్ విద్యుత్ పరికరాల ఏర్పాటుకు అవకాశం ఉండేది కాదు. అయితే ఈ దఫా ఒక కిలోవాట్ నుంచే సోలార్ విద్యుత్ తయారు చేసుకునేలా చిన్న ఇంటిపైనా పరికరాలు ఏర్పాటు చేసుకునేలా వీలు కల్పించారు.

● పథకం వివరాలు..

జిల్లాలో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీని ప్రకటించింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా సోలార్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో ఒక కిలోవాట్ నుంచి 5, 6కిలోవాట్స్ వరకు విద్యుత్‌ను ఉత్పత్తిని చేసుకోవచ్చు. నెలకు 150 యూనిట్ల మేర వాడకం ఉన్న వినియోగదారుడు తన ఇంటిపై 1 నుంచి 2 కిలోవాట్స్ వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. ఇంటి శ్లాబుపైన కేవలం పది చదరపు మీటర్ల స్థలం ఉంటే సరిపోతుంది. 1 కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.75వేల మేర ఖర్చవుతుండగా రూ.30వేల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. దీనిద్వారా నెలకు 100 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే 2కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రూ.1.4 లక్షలు ఖర్చవుతుండగా రూ.60 వేలు సబ్సిడీగా ఉంటుంది. 3 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.1.92 లక్షలు ఖర్చవుతుండగా రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. దీనిద్వారా 300 యూనిట్లు మేర విద్యుత్ ఉత్పత్తి చేసుకునే వీలు కలుగుతుంది.

● దరఖాస్తు ఇలా చేసుకోవాలి

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోదలచిన వారి కోసం విద్యుత్ సంస్థ రెండు యాప్‌లను రూపొందించింది. పీఎం సూర్య ఘర్ యాప్, క్యూఆర్‌టీపీఎం సూర్య ఘర్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని అందులో పొందుపరిచిన వివరాల మేరకు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే వినియోగదారుడి ఇంటి స్లాబ్ పటిష్టతను ప్రత్యేక ఇంజనీర్ ద్వారా ధ్రువీకరించిన పత్రాన్ని, ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్ బిల్లును (ఆరు నెలలు) అందజేయాల్సి ఉంటుంది. అలాగే నెట్ మీటర్ ఏర్పాటు తర్వాత ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభిస్తే కేంద్రం అందించే సబ్సిడీ మొత్తం ఆ ఖాతాలో జమ అవుతుంది.

ఇష్టారాజ్యంగా వేపచెట్ల నరికివేత



వేపమొద్దులను తరలిస్తున్న ట్రాక్టరు

అనంతసాగరం, మార్చి 5: మండలంలోని గ్రామాల్లో ఇష్టారాజ్యంగా వేపచెట్లను నరికివేస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు స్థలాలు అనే తేడా లేకుండా పచ్చని చెట్లను కొందరు నరివేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. చెట్లను తొలగించాలంటే ముందుగా సంబంధిత అధికారుల నుంచి పర్మిషన్ తీసుకోవాలి. చెట్టు తొలగింపుతో మరో మొక్కను నాటి సంరక్షించాలనే నిబం ధనలు పాటించడం లేదు. వేపచెట్ల మొద్దులను బొగ్గు బట్టీలు, పొగాకు బ్యారన్‌లకు తరలిస్తున్నారు. అధికారులు చొరవ చూపి చెట్లను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

- బ్యాంక్ ఉద్యోగికి త్రుటిలో తప్పిన ప్రమాదం



రెండు లారీల మధ్య దెబ్బతిన్న మోటారు సైకిల్

కావలి రూరల్, మార్చి 5: ముందు వెళ్తున్న లారీని మోటారు సైకిల్ అధిగమించే క్రమంలో వెనుక వస్తున్న లారీ మోటారు సైకిల్‌ను ఢీకొంది. మంగళవారం కావలి పట్టణంలో జరిగిన ఈ ప్రమాదంలో ఓ బ్యాంకు ఉద్యోగి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. స్థానిక ఫుల్లారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న చిన సుబ్బారెడ్డి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం ఇంటి నుంచి మోటారుసైకిల్‌పై బ్యాంకుకు బయలుదేరాడు. బ్యాంకు సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ముందు నెమ్మదిగా వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో వెనుక వైపున వేగంగా వచ్చిన భారత్ గ్యాస్ సిలిండర్ల లారీ మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోటారు సైకిల్ అడ్డం తిరిగి రెండు లారీల మధ్యన చిక్కుకుని ధ్వంసమైంది. ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి లారీని షడన్‌గా ఆపడంతో కింద పడిపోయిన చినసుబ్బారెడ్డి లారీ చక్రాల కింద పడకుండా, ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో బయటపడ్డారు.

అధికారపార్టీ నేతల హడావిడి

ఈ ప్రమాదంలో తప్పిదమంతా గ్యాస్ సిలిండర్ల లారీ డ్రైవర్‌దని సంఘటనా స్థలంలో ఉన్నవారు చెబుతున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అధికార వైసీపీకి చెందిన వారు కావడంతో వారికి మద్దతుగా ఆ ప్రాంతానికి కొందరు నేతలు అక్కడకు చేరుకుని కేసు లేదు ఏమి లేదు అంతా మనవారే అంటూ హడావిడి చేశారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ ఆ నెపం బ్యాంకు ఉద్యోగిపైకి నెట్టే ప్రయత్నం చేసి వాగ్వివాదానికి దిగాడు. స్థానికులు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చెయ్యడంతో పాటు పోలీసులు రంగప్రవేశం చెయ్యడంతో వివాదం సర్దుమనిగింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

అనధికార మద్యం విక్రయాలపై సెబ్ దాడులు

- లిక్కర్ షాపు సేల్స్‌మన్ అరెస్ట్



నిందితులతో సెబ్ పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 5: అనధికార మద్యం విక్రయాలపై సెబ్ అధికారులు మంగళవారం దాడులు చేసి 150 క్వార్టర్ సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనధికార మద్యం విక్రయదారులతో పాటు ప్రభుత్వ మద్యం దుకాణం ఉద్యోగిని అరెస్ట్ చేశారు. సెబ్ నెల్లూరు-1 స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆర్ విజయభాస్కర్‌రావు వివరాలను మీడియాకు వెల్లడించారు. నెల్లూరులోని ఇరగాళమ్మ సంఘం సమీపంలోని రాజీవ్ గృహకల్పకు చెందిన లక్ష్మి అనే మహిళ స్థానికంగా కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తోంది. ఆమెకు పొట్టేపాళెం గ్రామానికి చెందిన శ్రావణ్ బంధువు. వారిద్దరు కొంతకాలంగా అనధికారికంగా మద్యం విక్ర యాలు సాగిస్తున్నారు. వారికి కొండ్లపూడి గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్‌మన్ రమేష్‌తో పరిచయం ఏర్పడింది. రమేష్ సహకారంతో మద్యాన్ని కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సెబ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్‌కు పక్కా సమాచారం అందడంతో మంగళవారం తన సిబ్బందితో కలిసి లక్ష్మి ఇంటి పై దాడిచేశారు. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 150 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మి, శ్రావణ్‌తోపాటు సేల్స్‌మెన్ రమేష్‌ను అరెస్ట్ చేశారు. అనధికార మద్యం విక్రయాలు, అక్రమ నిల్వలను గుర్తిస్తే డయల్ 14500, 112కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

నెల్లూరు(క్రైం), మార్చి 5: తండ్రి మందలించాడని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని వేదాయపాళెం పోలీసులు మంగళవారం రాత్రి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరులో శ్రీనివాసులు, శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. వారికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు దగ్గర్లోని జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌ను బాలుడు పాడు చేశాడు. విషయం ఇంట్లో తెలిస్తే మందలిస్తారని టీచర్ వద్ద ఉందని తల్లిదండ్రులకు చెప్పాడు. గత నెల 14వ తేదీ తండ్రి శ్రీనివాసులు ట్యాబ్ గురించి గట్టిగా నిలదీయడంతో మన స్థాపానికి గురైన బాలుడు ఇంటి నుంచి పరారయ్యాడు. తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు జరిపారు. మంగళవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో బాలుడిని గుర్తించిన పోలీసులు వారి సంరక్షణలోకి తీసుకుని నెల్లూరుకు తరలించారు. వేదాయపాళెం స్టేషన్‌లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

రేషన్‌షాపులపై విజిలెన్స్ తనిఖీలు

నెల్లూరు(క్రైం), మార్చి 5: రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. నెల్లూరులోని విరాట్ నగర్‌లో గల 49వ నెంబరు రేషన్‌దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సీ మాణిక్యరావు, నెల్లూరు అర్బన్ పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ వారి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించగా షాపులో 37,121 కేజీల బియ్యం ఉండాల్సి ఉండగా 150 కేజీలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన బియ్యం ఏమయ్యాయని డీలర్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అధికారులు సదరు డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 5: బాలికకు ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్న వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన గురవయ్య కొంతకాలంగా ఆమెతో మాట్లాడేం దుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో బాలిక కుటుంబ సభ్యులందరూ బయటకు వెళ్లారు. ఇంటి బయట కూర్చొని ఉన్న బాలికను గురవయ్య బలవంతంగా తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాట లు చెప్పి ఆమెను శారీరకంగా లోబర్చుకున్నాడు. బాలిక భయపడి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. నిందితుడు మూడు రోజులుగా తన వద్దకు రమ్మని బాలికను పిలుస్తుండటంతో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తల్లి మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	258
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6157
వెండి కిలో ధర	రూ. 74,400
వెండి ఒక గ్రాము	రూ. 76.40

ఉద్యోగుల విజయం

రెవెన్యూ దినోత్సవం

- ఏటా సత్కారాలు, ప్రశంసలు
- జీవో విడుదలపై హర్షం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 5 : రెవెన్యూ వ్యవస్థలో రెవెన్యూ ఉద్యోగుల సాధించిన అద్భుత విజయం రెవెన్యూ దినోత్సవం. ఎంతో కాలంగా రెవెన్యూ ఉద్యోగులు ఈ దినోత్సవ ప్రకటన కోసం పోరాటం చేశారు. దాని ఫలితంగా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. 1780 జూన్ 20న రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటైంది. పాలనా వ్యవహారాల్లో రెవెన్యూ శాఖ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలు అందిస్తోంది. 237 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన రెవెన్యూ వ్యవస్థ సహకారంతోనే ప్రభుత్వం వంద సంవత్సరాల కాలం తరువాత భూముల రీసర్వే వంటి కార్యక్రమాలు చేపట్టింది. రెవెన్యూ ఉద్యోగులు నిరంతరం ప్రజలతో మమేకమై వారి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల మంజూరుతోపాటు భూ సంబంధ అంశాలు, ప్రజా పంపిణీ, ప్రకృతి విపత్తుల సాయం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జూన్ 20వ తేదీని రెవెన్యూడేగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎంతోకాలంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తోంది. ఎట్టకేలకు ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవానికి మార్గదర్శకాలను నిర్దేశిస్తూ సోమవారం ఉత్తర్వులు ఇవ్వటమే కాక, గజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.



జిల్లా కలెక్టర్ కార్యాలయం

రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం

రెవెన్యూ దినోత్సవం నాడు రెవెన్యూ శాఖపై అవగాహన కల్పించిన, శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వివిధ స్థాయిల్లో పనిచేసిన రెవెన్యూ ఉద్యోగులు, ఆ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరించనున్నారు. ఆరోజు ప్రశంసా పత్రాలు జారీ చేయనున్నారు. మండల స్థాయి నుంచి ఈ సత్కార కార్యక్రమాలు ఉంటాయి.

హర్షదాయకం



ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ ఏటా జూన్ 20వ తేదీన రెవెన్యూ దినోత్సవాన్ని జరుపు కోడానికి జీవో విడుదల చేయటం హర్షణీయం. ఏపీఆర్ఎస్ఏ సుదీర్ఘ కాలం పోరాటం తరువాత ఈ దినోత్సవానికి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో రెవెన్యూ ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించనున్నారు.

- అల్లంపాటి పెంచలరెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు

ఈసీ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు : కలెక్టర్



వెంకటాచలం : ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ తదితరులు

వెంకటాచలం, మార్చి 5: త్వరలో జరగనున్న ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయ ణన్ తెలిపారు. మంగళవారం వెంకటాచలంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తొలుత ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన గదిని తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థులు వేచి ఉండేందుకు అనువుగా వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు దరఖాస్తులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. తదుపరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, సిబ్బంది శిక్షణ, నామినేషన్ల స్వీకరణకు ఆర్వో కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది వసతి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి చిన్నఓబులేసు, ఎంపీడీవో ముజుబున్నిసా, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగం

బుచ్చిరెడ్డిపాళెం: ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ హరినారాయణన్ తెలి పారు. మంగళవారం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డితో కలిసి ఆయన మండలంలోని దామరమడుగు, సాల్మానుపురం, పెనుబల్లి గ్రామాల్లోని పలు పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గతంలో జరిగిన గొడవలపై ఆరా తీశారు. పెనుబల్లి సర్పంచు పెంచలయ్యతోపాటు పలువురితో మాట్లాడారు. వారి వెంట సీఐ హైమారావు, బీఎల్‌వోలు, దామరమడుగు నాయకులు, రెవెన్యూ, సచివాలయ అధికారులు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్

- జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



భవనం ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

నెల్లూరు (విద్య), మార్చి 5 : నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రం భవనాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. నెల్లూరు నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరుణమ్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను సీఎం ఒకేసారి ప్రారంభించారన్నారు. ఎంపీ సురేష్ ప్రభు నిధులు రూ.70లక్షలతో ఈ భవనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం హరినారాయణన్, జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ అధికారి వినీల్‌కుమార్, ఏపీడబ్ల్యూఐడీసీ ఈఈ శ్యాంసన్, ప్రిన్సిపాల్ ఎస్ రాజగోపాల్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ హెడ్ శివకుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై రగడ

- టీడీపీ నాయకుడి ఇంటికి పోలీసులు
- వెంటనే అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



పోలీసులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (క్రైం), మార్చి 5 : నెల్లూరు రూరల్‌లో సోషల్ మీడియాలో పోస్టుల రగడ చినికి చినికి గాలివానగా మారింది నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అభ్యంత కర పోస్టు పెట్టడంపై అందిన ఫిర్యాదు మేరకు 33వ డివిజన్ కార్పొరేటర్ మంజుల భర్త హజరత్ నాయుడు ఇంటికి మంగళవారం వేదాయపాలెం పోలీసులు వెళ్లారు. విచారణ కోసం స్టేషన్‌కు రావాలని సూచించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కడకు చేరుకుని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంవత్సరం కాలంగా తనపై పోస్టులు పెడుతున్నా వారిని వదిలేసి టీడీపీ నాయకుడిని విచారణ కోసం ఏవిధంగా పిలుస్తారని ప్రశ్నించారు. అక్రమ కేసులు బనాయిస్తే సుప్రీంకోర్టు ముందు పోలీస్ అధికారులను నిలబెడతామని హెచ్చరించారు. అనంతరం హజరత్‌నాయుడును టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేదాయపాలెం స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారించిన పోలీసులు అవసరమైతే మరోమారు విచారణకు హాజరు కావాల్సి వస్తుందని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై వైసీపీ నాయకులు సోషల్‌మీడియాలో పెట్టిన అనేక అభ్యంతకర పోస్టులను ఆధారలతోసహా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అటవీ పరిసరాలు శుభ్రంగా ఉంచండి

- ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వర్ రెడ్డి

సీతారామపురం, మార్చి 5: శివరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని నల్లమల అటవీప్రాంతంలో ఉండే ప్రముఖ సిద్దేశ్వర శివాలయంలోని అటవీ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఉదయగిరి రేంజ్ అటవీ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి ఆలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన సిద్దేశ్వర శివాలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ చైర్మన్ లక్కిడి బ్రహ్మయ్య, పూజారి సిద్దయ్య, ఉమామహేశ్వర శర్మలకు తగు సూచనలిచ్చారు. ఉత్సవాలు జరిగే సమయంలో ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని మట్టికుండల తో మంచినీటి సరఫరా చేసి భక్తుల అవసరాలు తీర్చాలన్నారు. రాత్రిపూట బాణా సంచాకాలిస్తే అటవీ ప్రాణులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సిద్దేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ లక్కిడి బ్రహ్మయ్య మాట్లాడారు. అటవీ అధికారుల సలహాలు సూచనలు తీసుకుని శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ఖాజా మహమ్మద్, గౌతమ్, సిద్దేశ్వర ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ విద్యార్థులు నూరుశాతం మార్కులు సాధించాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 5 : బీసీ ప్రీమెట్రిక్ వసతి గృహాలు, బీసీ కళాశాల వసతి గృహాల్లో చదువుతున్న పది, ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో నూటికి నూరు శాతం మార్కులు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం వసతి గృహ సంక్షేమాధికారులు, బీసీ సంక్షేమాధికారులతో నెల్లూరులోని బీసీ స్టడీ సర్కిల్‌లో సమీక్ష జరిపారు. వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలోని 54 ప్రభుత్వ బీసీ వసతి గృహాల నుంచి 10వ తరగతి పరీక్షలకు 631 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే బీసీ కళాశాల వసతి గృహం నుంచి 633 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వటం జరిగింద న్నారు. ఈ సమీక్షలో సహాయ బీసీ సంక్షేమాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ స్టార్స్‌లో టెండర్లకు ఆహ్వానం

నెల్లూరు(క్రైం), మార్చి 5: నెల్లూరు మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో శిక్షణ నిమిత్తం వచ్చే జైళ్లశాఖ సిబ్బందికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి భోజన సదుపాయం కల్పించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టార్స్ ప్రిన్సిపాల్ ఎస్ రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల కాంట్రాక్టర్లు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రూ.112 చెల్లించి టెండర్ ఫారాలను పొందవచ్చన్నారు. టెండర్ వేసే వారు డిపాజిట్ కింద రూ.37,140 చెల్లించాలన్నారు. పూర్తిచేసిన ఫారాలను ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట లోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని, అదేరోజు 2.30 గంటలకు టెండర్లు తెరుస్తామని తెలిపారు.

పొదలకూరులో జోరుగా కాపీయింగ్

- ఇంటర్ పరీక్షల్లో చూచిరాతలు



పొదలకూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాల బాత్‌రూమ్‌లో విద్యార్థులు రాసి పడేసిన చిట్టాలు

పొదలకూరు, మార్చి 5: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు చూచిరాతలు రాస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్విజిలేటర్లుగా పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను పట్టించుకోకుండా వదిలేయడంతో మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కాలేజీ బాత్‌రూమ్‌ల వద్ద విద్యార్థులు చూసి రాసి పడేసిన చిట్టాలు (స్లిప్పులు)ఈ ఆరోపణలను నిజం చేస్తున్నాయి. ఇన్విజిలేటర్లే విద్యార్థులను చూసిరాతలకు ప్రోత్సహిస్తూ సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్ వచ్చే సమయంలో వారిని అలర్ట్ చేస్తున్నారని పలువురు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికీ బాత్‌రూమ్‌ల్లో విద్యార్థులు రాసి పడేసిన చిట్టాలు కూడా అలాగే ఉన్నాయి. సీసీ కెమెరాలు ఉన్నా అవి నామ మాత్రంగానే పని చేస్తున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆగని గ్రావెల్ అక్రమ రవాణా

- వైసీపీ నేతల కనుసన్నల్లో తవ్వకాలు
- సహకరిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- కంటేపల్లిలో టీడీపీ నాయకుల నిరసన



చెరువులో ఏర్పడిన భారీ గుంతల వద్ద నిరసన తెలుపుతున్న కంటేపల్లి టీడీపీ నేతలు

వెంకటాచలం, మార్చి 5: మండలంలోని కంటేపల్లి పంచాయతీ నందిగుంట చెరువులో రెండు రోజులుగా గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా జరుగుతుంది. చెరువులో భారీ యంత్రాలు పెట్టి పదుల సంఖ్యలో టిప్పర్లతో వైసీపీ నాయకులు గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. మంగళవారం కంటేపల్లి టీడీపీ నేతలు ఆస్తోటి నాగరాజు, ఆస్తోటి సుబ్బయ్య, రవికుమార్, మాలపాటి సుబ్బయ్య, కూని రత్నం, గంప నరసయ్య తదితరులు గ్రామస్థులతో కలిసి గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ విషయమై వారు రిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా, పట్టించుకోలేదన్నారు. పైపెచ్చు మూడు రోజుల అనుమతి ఉందని చెప్పడం సిగ్గుచేటుగా ఉందని వారు విమర్శించారు. అధికారుల తీరును బట్టి చూస్తే గ్రావెల్ మాఫియాకు సహకరిస్తున్నట్లుగా ఉందని వారు పేర్కొన్నారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

అధికారులు నిర్లక్ష్యం కారణంగా విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తికి ఆలవాటు పడి నిరక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల కిందట వేసవిలో బుజబుజనెల్లూరుకి చెందిన ముగ్గురు చిన్నారులు నక్కలకాలనీ వైపు చెముడుగుంట చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు ఇందుకు కారణం భారీగా ఏర్పడిన గ్రావెల్ గుంతలే. గ్రామస్థులు అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి గ్రావెల్ మాఫియాను అరికట్టినట్లయితే ఇలాంటి ఘటనలు పునరావృతం అయి ఉండేవికావు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం గ్రావెల్ మాఫియా ఆగడాలను అడ్డుకోవడంతో పాటు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



తహసీల్దారు కార్యాలయం వద్ద పట్టుబడ్డ గ్రావెల్ ట్రాక్టర్లు

అనంతసాగరం, మార్చి 5: అనంతసాగ రం వెంకయ్య స్వామి ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూమి నుంచి బుధవారం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ వాహనాలను అదుపులోకి తీసుకుని తహసీల్దారు కార్యాలయం వద్దకు తరలించారు. అయితే కాసేపటికి వాహనాలను వదిలేశారు. రెవెన్యూ అధికారుల తీరుపై స్థానికులు పలురకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- లౌకికవాద పార్టీలతో కలిసి ఎన్నికల పోరు
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మాట్లాడుతున్న మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), మార్చి 5 : దేశంలో మతోన్మాదాన్ని రేకెత్తించే భారతీయ జనతా పార్టీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపుని చ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ వంటి లౌకికవాద పార్టీలను కలుపుకుని ఎన్నికల పోరులో ప్రజల వద్దకు వెళుతున్నామన్నారు. బుధవారం నుంచి నగరంలోని ప్రతి డివిజన్‌లో సీపీఎం నాయకత్వం పర్యటిస్తుందని చెప్పారు. నగరంలో సమస్యలు తిష్టవేశాయని, వాటి పరిష్కా రంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. మతం పేరుతో చీలికలు సృష్టి స్తున్న బీజేపీకి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు తెలుపుతు న్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, చంద్రారెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన పారిశుధ్యం

- ఆత్మకూరులో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచుల వాడకం
- మురుగు కాలువల్లో పడి నిండుతున్న వైనం
- రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఆత్మకూరు: పట్టణంలో పాలిథిన్ కవర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కాల్చివేస్తే విషవాయువుగా మారి పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. పాలిథిన్ కవర్లను వాడవద్దని మున్సిపల్ అధికారులు చెప్తున్నా.. ప్రజలు వాడుతూనే ఉన్నారు. ప్రభుత్వం నిషేధించినా సక్రమంగా అమలు జరగడంలేదు. ప్లాస్టిక్ సంచులను వ్యాపార్లు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆత్మకూరులోని వీధుల్లో చెత్తాచెదారంతో పాటు పాలిథిన్ కవర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాతావరణం కాలుష్యంతోపాటు పారిశుధ్యం అధ్వాన్నస్థితికి చేరుకోవడానికి ఇవి కారణమవుతున్నాయి. పాలిథిన్ సంచులను వీధుల్లో, కాలువల్లో పారేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తు న్నాయి. కొన్నిచోట్ల మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. పాలిథిన్ సంచుల వాడ కాన్ని నిషేధించినా ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో వాటి వాడకా న్ని మానడం లేదు.

వింజమూరు: స్థానిక వీఆర్ పంక్షన్ ప్లాజా ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డులోని మురుగుకాలువ పూడికతో నిండిపోయింది. ఈ సమస్యతో మురుగు నీరు రోడ్డు మీదకు పారుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోంది. దుర్వాసన వస్తుండటం వల్ల జనాలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించాలని చుట్టుపక్కల షాపు యజమానులు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇంటి, షాపు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ అవసరాలను తీర్చడంలో లేదన్నారు.



మురుగు కాలువలో పేరుకుపోయిన పాలిథిన్ సంచులు

అభివృద్ధి పనుల ప్రారంభం

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి నడిగడ్డ అగ్రహారం, మాముడూరులో పలు అబివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, సుధాకరరెడ్డి, సొసైటీ చైర్మన్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు నడిపేందుకు సహకరించండి



నాయకులతో చర్చిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

ఉదయగిరి, మార్చి 5: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయగిరి డిపో నుంచి సిద్ధేశ్వరం, భైరవకోన, కోయిలంపాడులకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ యూనియన్ నాయకులు సహకరించాలని డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక డిపోలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగ భూషణం, గ్యారేజీ ఇన్‌చార్జి నాగరత్నం, యూనియన్ నాయకులు కాశీవిశ్వనాథం, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు కమిషనర్ షేక్ ఫజుల్లులా మంగళవారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. స్థానిక 17వ వార్డులో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని వాటితో వ్యాధుల బారినపడతామో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మురుగుకాలువలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయని చెప్పారు. అన్నివార్డుల్లో క్రమంతప్పకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పారిశుధ్య పనులు చేప ట్టాలని కమిషనర్‌ను స్థానికులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, గందళ్ల వేణు, నాయకులు, మున్సిపల్ అధికారి ఖాసీం, సిబ్బంది పాల్గొన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ ఫజుల్లులా

ఉదయగిరి నియోజకవర్గ పాస్టర్ల కమిటీ ఎంపిక

ఉదయగిరి రూరల్, మార్చి 5: స్థానిక బర్రిడ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో మంగళవారం నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా బీ.అహరోన్, ఉపాధ్యక్షుడిగా థామస్, ప్రధాన కార్యదర్శిగా జాషువా, జాయింట్, ఆర్గనైజింగ్ కార్యదర్శు లుగా ప్రేమానందం, జోసెఫ్, ట్రెజరర్‌గా డేవిడ్, గౌరవాధ్య క్షుడిగా రమేష్, గౌరవ ఉపాధ్యక్షుడిగా ముత్తయిలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా బోయజు, అబ్రహం, మోషే, మైఖే ల్, చంద్రయ్య, సంపత్‌కుమార్, ప్రసాద్, యోసేలు ఉన్నారు.



ఎంపికైన పాస్టర్ల కమిటీ

నాడు-నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి

ఉదయగిరి రూరల్ : మనబడి నాడు-నేడు పథకం కింద మండలంలో జరుగుతున్న రెండోవిడత పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యమైన వస్తువులను వాడాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, వాటర్, ఎలక్ట్రిషన్, కిచెన్‌షెడ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమైనట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

నూతన బస్టాండ్‌లో ఆగని సర్వీసులు

అనంతసాగరం, మార్చి 5: మండలకేంద్రం అనంతసాగరంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ప్రాంగణంలోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 7గంటలకు ఆత్మకూరు నుంచి అనంతసాగరం మీదుగా బెంగళూరుకు వెళ్లే సర్వీసులు పాత పద్ధతిలో గతంలో ఆపేచూటే ప్రయాణికులను దించి వెళుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రయాణికులు మూత్రవిసర్జనకు వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. రాపూరు డిపోకు చెందిన తిరుపతి బస్సు కూడా ఉదయం సమయంలో బస్టాండ్ ప్రాంగణంలో నిలపడం లేదని అధికారులు చొరవ చూపి బస్సులు ఆపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

సంగం, మార్చి 5: జండాదిబ్బలోని 0.65 సెంట్ల ప్రభుత్వ భూమిని మంగళవారం ఆర్డీవో మధులత పరిశీలించారు. పంచేడు గ్రామానికి చెందిన శివకోటయ్య అనే రైతు కొన్ని సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న ఈ భూమిని తనకు హక్కులు కల్పించాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఆర్డీవో గ్రామనికి వెళ్లి భూమిని పరిశీలించారు. బీడుగా ఉన్న భూమిని పరిశీలించి గ్రామస్థులతో విచారించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. తహసీల్దారు రమాదేవి, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో

భీమేశ్వరుడికి హంసవాహన సేవ

సంగం, మార్చి 5: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం (రెండోరోజు) అర్ధరాత్రి భీమేశ్వరస్వామి హంస వాహనంపై గ్రామోత్సవంలో ఊరేగారు. అంతకుముందు పూజారులు కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేం చేసి గజమాలలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. గామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పూలంగిసేవ ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి కిషోర్ కుమార్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



హంస వాహనంపై భీమేశ్వరుడు

8న పార్వతీపరమేశ్వరుల కల్యాణం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక కొండపై వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కంభం సిద్ధారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు కల్యాణోత్సవం పాటు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పోలింగ్ సెక్టార్ అధికారులకు శిక్షణ

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి సెక్టార్ అధికారి తమకు కేటాయించిన బూత్‌లను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. కేంద్రాల వద్ద ఓటర్లకు, సిబ్బందికి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంపులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమ స్యాత్మక గ్రామాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్లాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధి లోని ఓటర్లతో సంబంధాలు ఏర్పర్చుకోవాలన్నారు. సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు, ఎనిమిది మండలాల సెక్టార్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్

విజయసాయిరెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 5: వైసీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మాట్లాడారు. తొలిసారిగా విజయసాయిరెడ్డి నెల్లూరుకు వస్తున్న సందర్భంగా కావలిలో ఆయనకు ఘనస్వాగతం పలుకుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, మల్యాద్రిరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్లు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఓబులరెడ్డి, తిరుపతినాయుడు, సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనం, కోటంరెడ్డిలను కలిసిన కాకర్ల

ఉదయగిరి, మార్చి 5: నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మంగళవారం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూర ల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను నెల్లూరులోని వారి నివాసాల్లో మర్యాదపూ ర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఉదయగిరి రాజకీయ స్థితిగతులపై చర్చించి తన గెలుపుకు సహకరించాలని కోరారు.



మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సన్మానిస్తున్న కాకర్ల

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఓటుపై అవగాహన ఉండాలి

అల్లూరు : యువతకు ఓటుపై అవగాహన ఉండాలని తహసీల్దారు దుర్గేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం యువతకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, రామకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉండటం బాధాకరం

- సీపీఐ రాష్ట్ర నేత రావుల వెంకయ్య

కందుకూరు, మార్చి 5: రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల పాలన కొనసాగించడం బాధాకరమని, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టుపెట్టి తీరని అన్యాయం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు రావుల వెంకయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కేంద్రం మెడలువంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలకు నమ్మబలికిన జగన్ అధికార పీఠం ఎక్కాక తన స్వప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఊసే ఎత్తకుండా ప్రధాని నరేంద్ర మోదీ వద్ద మోకరిల్లాడని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయాడని, విశాఖ రైల్వేజోన్ కోసం పోరాటం లేదని, పోలవరం పురోగతి లేకుండా చేశాడని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కలగించటంలో కేంద్రంలోని బీజేపీ పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారడంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం జరగాలన్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు పలువురు నేతల నివాళి

బిట్రగుంట, మార్చి 5: బోగోలు పంచాయతీకి చెందిన కాపు నేత మెతుకు రమేష్ బాబు సోమవారం మృతి చెందగా మంగళవారం పలువురు నేతలు రమేష్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, స్థానిక నేతలు నాగేశ్వరావు, మాధవరావు, సుధీర్‌బాబు, అహ్మద్ బాషా, పిచ్చయ్య, నరసింహారావు, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, నాయకులు టీ.వెంకయ్య, శ్రీనివాసులు, సీపీఎం నేత వెంకయ్య నివాళర్పించారు. ఆర్వీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామిశెట్టి వెంకటసుబ్బారావు, కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు రవిప్రకాష్, కాపు సంఘ నాయకులు శ్రీనివాసులు, రాఘవయ్య, శ్రీహరిరాయలు చలపతి, కేశవరావు తదితరులు ఆయన అంత్యక్రియలలో పాల్గొన్నారు.



రమేష్‌బాబుకు నివాళర్పిస్తున్న కృష్ణారెడ్డి

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు, మార్చి 5: మండలంలోని జి.మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ యు.దాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 21న 5వ తరగతి సిలబస్‌పై ఆబ్జెక్టివ్ విధానంలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో వేర్వేరుగా ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 8106433746ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, మార్చి 5: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న దాతల సహకారం మరువలేనిదని ఎంఈవోలు ఎంవీవీ ప్రసాదరావు, కే.సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని కోవూరుకు చెందిన మాల్యాద్రి మంగళవారం పట్టణంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.చిన్నారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్పీ కె.ఉదయలక్ష్మి, కావ్య, ఏసుదాసు, సీఆర్‌ఎంటీలు రమణారెడ్డి, శ్రీను, కిరణ్, కీర్తి, రాగమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

వలేటివారిపాలెం, మార్చి 5 : మండలంలోని శాఖవరం ఎస్సీ కాలనీ సమీపంలోని ప్ర ధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడి అనుమానాస్పదంగా మృతి చెందాడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గుడ్లూరు సీఐ సుబ్బారావు, లింగసముద్రం ఎస్ఐ బాజీబా బు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు శాఖవరంకు చెందిన చుంచు శివకృష్ణ (32)గా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. ఎస్సీ కాలనీలోని పోకూరు వీఆర్‌కోట రోడ్డులో గడ్డం గోవిందమ్మ ఇంటి ముందు రోడ్డు పక్కన శివకృష్ణ మృతి చెంది ఉన్నాడు. మృతుడు మద్యం సేవించి పోకూరు నుంచి శాఖవరం వెళ్తూ మద్యం మత్తులో ముందుకు పడిపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే మృతడి శరీరంపై గాయాలు ఉండడంతో అనుమానాలు వ్యక్తం అవుతోన్నాయి. మృతుడు తల్లిదండ్రులు సుబ్బారావు, వెంకటరమణమ్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

పేద కళాకారుడికి డోలు, సన్నాయి బహూకరణ

కందుకూరు, మార్చి 5: నిరుపేద నాయీ బ్రాహ్మణ కళాకారులకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు మంగళవారం డోలు, నాదస్వరం బహూకరించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తాను, తన సోదరుడు సాంబశివరావు కలిసి వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాకల శ్రీహరి, కొత్తకోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ డిక్లరేషన్ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

కందుకూరు, మార్చి 5: మంగళగిరిలో టీడీపీ చేపట్టిన జయహో బీసీ డిక్లరేషన్ బహిరంగ సభకు కందుకూరు నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు మంగళవారం అధికసంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపగా ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ముందుగా పట్టణంలోని స్వర్గీయ ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, ముచ్చు శ్రీను, ముచ్చు వేణు, సవిడిబోయిన వెంకటకృష్ణ, వివిధ మండలాల బీసీ నాయకులు పాల్గొన్నారు.



జయహో సభకు తరలివెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

- తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య అన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 25వ వార్డు కల్లూరి ప్రశాంతి నగర్, కల్లూరి కోటయ్య నగర్‌లలో మంగళవారం సాయంత్రం ఆమె ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆమె వెంట నాయకులు, మహిళలు ఉన్నారు.

రైల్వేస్టేషన్ స్వీపర్లకు జీతభత్యాలు చెల్లించాలి

కావలిటౌన్, మార్చి 5: రైల్వే స్టేషన్‌లో సుమారు 6ఏళ్ల నుంచి స్వీపర్లుగా పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతభత్యాలు చెల్లించాలని సీఐటీయూ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె రెహనాబేగం డిమాండ్ చేశారు. మంగళవారం కావలి రైల్వేస్టేషన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 6 ఏళ్ల నుంచి స్వీపర్లకు కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయలేదని, 3 నెలల నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. ఇదే విషయమై రైల్వే అధికారులను అడగగా కాంట్రాక్టర్ గడువు పూర్తయిందని తమకు సంబంధం లేదనడండం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులచే పనులు చేయించుకునే అధికారులకు కార్మికుల సమస్యలు పట్టవా ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

కావలిటౌన్, మార్చి 5: మహిళల ఆర్థిక సాధికారత కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలోని అన్నా క్యాంటీన్ భవనంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మెప్మా ఏపీ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మిలు ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మి జూమ్ యాప్ ద్వారా కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళల అభిప్రాయాలు సేకరించారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, ఆహా క్యాంటీన్, మహిళా మార్ట్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

హంస వాహనంపై మల్లన్న దర్శనం

కావలిటౌన్, మార్చి 5: కావలి పట్టణ పాతూరులోని ప్రాచీన శివాలయంలో శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు (కుంభమాస తిరునాళ్లు) భాగంగా సోమవారం మల్లన్నకు హంసవాహన సేవలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజలు, బలిహరణ, పల్లకీ సేవలు నిర్వహించారు. రాత్రి మల్లన్న హంస వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

దివ్యాంగ యువకుడికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న నళినీదేవి

లింగసముద్రం, మార్చి 5 : మండలంలోని ఎర్రారెడ్డి పాలెంకు చెందిన చీమలదిన్నె వెంగళరావు అనే దివ్యాంగ యువకుడికి కందుకూరులోని రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్, టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి వీల్‌చైర్ అందజేశారు. మంగళవారం ఎర్రాఎడ్డిపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పొడపాటి నరసింహం, స్థానిక టీడీపీ నాయకులు ఉట్లపల్లి పెద్ద మాధవ, ఉప్పుటూరి రమణయ్య, దండేబోయిన పెద నరసింహ, కామినేని ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

వలేటివారిపాలెం, మార్చి 5 : విద్యార్థులు బాగా చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జడ్పీటీసీ ఇంటూరి భారతి సూచించారు. మండలంలోని పోకూరు హైస్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సభ జరిగింది. ముందుగా సరస్వతిదేవికి పూజ చేశారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక, కందుకూరు ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు. ఎంఈవో మల్లికార్జునరావు, హెచ్ఎంలు కమల్‌కుమార్, చిన్నయ్య టీచర్లు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి వీ.మంజుల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెంలో ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు ఎస్.వేణి, అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణారెడ్డిని కలసిన అలేఖ్య

కావలి, మార్చి 5: తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య మంగళవారం ముసునూరులోని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. తనకు అప్పగించిన ఈ పదవికి న్యాయం చేస్తూ కావలిలో టీడీపీ జెండా ఎగుర వేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త పోతుగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 15 మందికి ఉద్యోగాలు

కందుకూరు, మార్చి 5: ఆర్కే ఇన్ఫోసిస్టమ్స్ కార్పొరేట్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 15మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుందని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో తీవ్రమైన సంక్షోభం నెలకొని ఉన్న తరుణంలో యూఏఈ కేంద్రంగా ఉన్న కంపెనీ తమ విద్యార్థులను రూ.3.55 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసుకోవటం హర్షదాయకమని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు. మెయిల్ ద్వారా ఉద్యోగ నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు.

పేద మహిళకు ఆర్థిక సాయం



మహిళకు నగదు అందజేస్తున్న సభ్యులు

కావలిటౌన్, మార్చి 5: కేన్సర్‌తో బాధపడుతున్న పేద మహిళ బీబీజాన్ వైద్య ఖర్చుల కోసం మంగళవారం వాకర్స్ అసోసియేషన్ రూ.10,500 ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ శేషయ్య, సభ్యులు నల్లపరెడ్డి శ్రీనివాసులు, మంద వెంకటేశ్వర్లు, రమేష్, భాస్కర్‌నాయుడు, బత్తిన శ్రీనివాసులు, గోపాల్, సత్యానందం, ప్రేమ్‌కుమార్, ఆర్టీసీ బాషా తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పల్స్ పోలియో

వలేటివారిపాలెం, మార్చి 5 : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం మంగళవారంతో నూరుశాతం పూర్తయినట్లు వైద్యాధికారి మణిదీపిక తెలిపారు. మండలంలోని 3,963 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, శివ, ఏఎన్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లు లేక ఎన్నో బాధలు

- ఏళ్ల తరబడి ఇక్కట్లు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


విద్యార్థినులు బాత్‌రూమ్‌గా వినియోగించుకునే ఖాళీ స్థలం

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి5: బుచ్చి పెద్దూరులోని బెజవాడ బుజ్జమ్మ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బాత్‌రూమ్‌లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకట్రెండు రోజులు కాదు.. ఏళ్ల తరబడి వారు అవస్థలు పడుతున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ హైస్కూలులో 6 నుంచి 10వతరగతి వరకు 750మంది, వీరితోపాటు మరో ప్రాథమిక పాఠశాలను విలీనం చేయగా, వారు మరో వంద మంది వరకు చదువుకుంటున్నారు. బాలికలకు మరుగుదొడ్లు లేక పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాన్ని వినియోగించుకుంటున్నారు. హైస్కూలు వీధి వెనుక లేఅవుట్లు, శ్మశానం ఉన్నాయి. అక్కడకు వెళ్లాలన్నా వారు భయపడుతున్నారు. నాబార్డు నిధులు రాక తరగతి గదులు, బాత్‌రూమ్‌ల నిర్మాణం పూర్తి కాలేదు. మరో పదిరోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి. ఈ విషయంపై హెచ్‌ఎం సుజాతను వివరణ కోరగా ఉన్న మెటీరియల్‌తో కొంతవరకు పనులు జరిగాయి. నాబార్డు నిధులు రాగానే మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. బాలికల వసతి కోసం తాము చందాలు వసూలు చేసి ఖాళీస్థలం కొన్నామని ఆమె చెప్పారు.

ఖాజానగర్‌లో మైనారిటీ యువకులు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారిలో దినేష్‌రెడ్డి


మనుబోలు : కాగితాలపూరులో బాబు ష్యూరిటీ సంచిని అందిస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి5: బుచ్చి నగర పంచాయతీ 6వవార్డు పరిధి ఖాజానగర్‌లో మంగళవారం 20కుటుంబాలకుపైగా మైనారిటీ యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. 6వవార్డు పరిధిలో ఆ వార్డు ఇన్‌చార్జి సుల్తాన్ బాషా, బచ్చాబాయ్‌తోపాటు పలువురు నాయకులు కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దినేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మైనారిటీలకు కల్పించిన పలు సంక్షేమ పథకాలన వైసీపీ తొలగించి ముస్లిం కడుపుకొట్టిందన్నారు. సీఎం జగన్‌కి, ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంవీ.శేషయ్య, జాకీర్, షబ్బీర్, సర్దార్, ప్రభాకర్‌రెడ్డి, బాలాకుమార్, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీతోనే బీసీల అభ్యున్నతి : దినేష్‌రెడ్డి

కొడవలూరు : టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. జయహో బీసీ సభకు వెళుతున్న వాహనాలకు మంగళవారం మండలంలోని నార్తురాజుపాళెంలో ఆయన జెండా ఊపారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలు తీవ్రంగా నష్ట పోయారన్నారు. రాష్ట్రంలో నేడు బీసీల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెక్కా మదన్, మాతూరి శ్రీనివాసులురెడ్డి, చెముకుల శ్రీనివాసులు యాదవ్, బీ హరికృష్ణ, కేతూ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు

మనుబోలు : వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని మండల టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని కాగితాలపూరులో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ చిట్టిబాబు, వీ కిరణ్, బీ వెంకటరమణారెడ్డి, దినేష్‌రెడ్డి, గుమ్మా రవి, అడపాల సతీష్‌రెడ్డి, కొండూరు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు



బుచ్చిరెడ్డిపాళె,మార్చి5: స్థానిక రామకృష్ణానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గాదంశెట్టి సుబ్రహ్మణ్యం కుటుంబం, ఊటుకూరు రాఘవేంద్రరావు కుటుంబం వ్యవహరించింది. కాగా స్వామివారు బుధవారం కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

పొదలకూరు, మార్చి 5: మండలంలోని ప్రభగిరిపట్నంలో ఉన్న పార్వతి సమేత కైలాసనాథుడి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 9వతేదీ వరకు జరుగనున్నాయి. మంగళవారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ జరిగింది. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కాసా పెంచలయ్య, యనమల మహేంద్ర, చైతన్య, వరప్రసాద్, యడ్ల నాగేశ్వరరావు, దొంతిరెడ్డి కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీదారులకు అండగా కాకాణి : సోమిరెడ్డి


జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, మార్చి 5: గిరిజన గృహాల దోపిడీదారులకు అండగా మంత్రి కాకాణి ఉన్నారని, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అరవపాలెంలో మంగళవారం జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీలో భారీ కుంభకోణం జరిగిందని, వరిగొండలో 225, కోడూరులో 58, నరుకూరులో 29 గృహాలను మంత్రి కాకాణి కాంట్రాక్టర్ నరేంద్రకు అప్పజెప్పారని పేర్కొన్నారు. తూతూ మంత్రంగా బేస్‌మెంట్ నిర్మాణం చేసి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే రూ.2,09,16,000లను కాంట్రాక్టర్‌కు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దోపిడీకి పాల్పడిన వారిపై సీఐడీ ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, జనసేన నాయకులు సురేష్‌నాయుడు, గిరిజన నాయకులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి ఆనం అడ్డంకి

రాపూరు(డక్కిలి) : వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అడ్డంకిగా మారారని తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రాపూరులోని తెలుగుగంగ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల ఓట్లుతో ఎమ్మెల్యే అయిన ఆనం రామనారాయణరెడ్డి రాపూరుకు చేసింది శూన్యమన్నారు. అందుకే రాపూరు అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దయాకరరెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి : కురుగొండ్ల


కురుగొండ్ల సమక్షంలో టీడీపీ చేరిన నాయకులు

సైదాపురం, మార్చి 5: రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు.మంగళవారం మండలంలోని తోకలపూడి గ్రామంలో నిర్వహించిన విజయశంఖారావంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి మినీమెనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగసముద్రం పంచాయతీలో వైసీపీకి చెందిన 20కుంటుబాలు టీడీపీలో చేరారు. కురుగొండ్ల వారికి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెన్ని రమణయ్య, కొండూరు సుబ్రమణ్యంరాజు, కీర్తిపాటి రాజశేఖర్‌రాజు, కేవీరాజు, ఎల్లంరాజు, వెంకటకృష్ణమరాజు, నందిమండలం సుబ్బరాజు, చందు, గోడ్ల గంగాధర్ పాల్గొన్నారు.

సోమిరెడ్డీ.. ప్రజలు నిన్ను వద్దనుకున్నారు !

ముత్తుకూరు, మార్చి 5: చేసిన పాపాలకు ఫలితంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు నాలుగుసార్లు తరిమికొట్టారని మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి విమర్శించారు. ముత్తుకూరు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి పొరలు కమ్ముకున్న సోమిరెడ్డి తమ నాయకుడు మంత్రి కాకాణిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాళ్లపూడిలో అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమని ఉపసర్పంచి గోపాల్ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నెల్లూరు శివప్రసాద్, రాగాల వెంకటేశ్వర్లు, గండవరపు సురేష్, తుమ్మతాటి రాజా, ఎంపీటీసీ నవీద్, రితేష్, తదితరులు పాల్గొన్నారు.

పాటూరులో వరిపైరు పరిశీలన

కోవూరు : మండల పరిధిలోని పాటూరు గ్రామ పొలిమేరల్లోని వరిపైరు పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వారు రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ డీపీవో జీ శివన్నారాయణ మాట్లాడుతూ మురుగుడు పొలాల్లోని వరిపైరు పోషకాల లోపం వల్ల కుళ్లిపోతుందన్నారు.ఇలాంటి పొలంలో సల్ఫైడు ఎరువులు, 20.20. 0.13 సూపర్ పాస్ఫేట్ వాడకూడదని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త మధుసూదనరావు, ఆత్మ ఏడీపీ మారుతీదేవి, ఏవో శైలజాకుమారి, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వీఏఏలు చైతన్య, చాన్విక పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

తోటపల్లిగూడూరు,మార్చి 5: మండలంలోని చెన్నపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సరస్వతిపూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వారికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను విద్యా కమిటీ సభ్యులు, మిడ్‌డే మీల్స్ ఏజెన్సీ సహకారంతో అందించారు. ఎంఈవో శ్రీజయరామనాయుడు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, పాడిన పాటలు, చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌ఐ

మనుబోలు : ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం, సరైన పత్రాలు లేకుండా ఉండటం, టౌన్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ ఆటోలను పార్కింగ్ చేయడం, అతివేగంగా నడపడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు అల్లూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ పోర్టులో భద్రతపై ప్రత్యేక దృష్టి : పోర్టు సీఈవో

ముత్తుకూరు : భద్రతపై అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రత్యేక దృష్టి కలిగి ఉంటుందని పోర్టు సీఈవో జీజేరావు తెలిపారు. 53వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్టులో భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ప్రత్యేక విభాగం కలిగి ఉందని వివరించారు. ర్యాలీ సందర్భంగా ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం భద్రతపై ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోర్టు సీవోవో రాజన్‌బాబు, సెక్యూరిటీ హెడ్ రామకృష్ణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వవ్వేరు బ్యాంకు అవకతవకలపై ఎవరిని వదలను!

బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరు బ్యాంకులో జరిగిన అవకతవకలపై ఇప్పటికే సీబీసీఐడీకి లెటర్ రాశానని, ఈ విషయంలో ఎవరిని వదిలిపెట్టనని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిలోని వవ్వేరు బ్యాంకులో మంగళవారం జరిగిన త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్‌గా టంగుటూరు మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్లుగా అల్లం శ్రీనివాసులు, మల్లు జయరామిరెడ్డితో బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంపాదన కోసం తాను బ్యాంకు చైర్మన్‌గా రాలేదన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలిన నేతలు

విడవలూరు : మంగళగిరిలో టీడీపీ నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు మంగళవారం కోవూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, అమరేంద్రరెడ్డి, ఆవుల రవిచంద్ర, ఇమాంబాష తదితరులు తరలివెళ్లారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులు

నెల్లూరు (విద్య), మార్చి 5 : నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లో బోటనీ, మైక్రోబయాలజీ అధ్యాపకులకు ఐదురోజులు నిర్వహించిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ ప్రారంభించామని చెప్పారు. దీనికి అనుగుణంగా అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంచేం దుకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన అధ్యాప కులు విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో విద్యనందించి వారి ఉన్న తికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఈ కన్యాకుమారి, డాక్టర్ వై మంజునాథ్, డీ రాజశేఖర్, డాక్టర్ మక్సూద్ అహ్మద్ రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, జిల్లాలోని 15 కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పోషకాహార పునరావాస కేంద్రం

- రూ. 35 లక్షలతో యూనిట్ ప్రారంభం


పునరావాస కేంద్రం ప్రారంభోత్సవంలో ఆదాల, వైద్యులు

నెల్లూరు (వైద్యం), మార్చి 5 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోషకాహార పునరావాస కేంద్రం (న్యూట్రిషన్ రీహాబి టేషన్ సెంటర్) మంగళవారం ప్రారంభమైంది. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి దీనిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ. 35 లక్షలతో ఈ పునరావాస కేంద్రం అందుబాటులోకి వచ్చిందని, పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులకు ఈ కేంద్రం సంజీవనిలా ఉపయోగపడు తుందని చెప్పారు. 20 పడకలతో ఏర్పాటైన కేంద్రంలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. గతంలో కంటి విభాగం ఇక్కడ ఉండేదని, ఆ భవనాన్ని ఆధునీకరించి పోషకాహార కేంద్రంగా రూపుదిద్దామని వెల్లడించారు. పోషకాహార లోపంతో బాధపడేవారు పిల్లలను రక్షించుకునే విధంగా తల్లిదండ్రులు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి వైద్య విభాగం కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, హరిబాబు యాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, అడిషనల్ సూపరిం టెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ నరేంద్ర, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఏపీఎం ఎస్ఐడీసీ ఈఈ సుధాకర్‌గౌడ్, డీఈ శివశంకర్, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు రక్షణ కల్పించండి

నెల్లూరు రూరల్, మార్చి 5 : నెల్లూరు రూరల్లోని దేవరపాళెంలో తాము కొనుగోలు చేసిన భూములకు రక్షణ కల్పించాలని సురేష్ బాబు, వెంకట్, శ్రీనివాసరావు అనే వ్యక్తులు కోరారు. వారు మంగళవారం నెల్లూరులో మీడియా సమావేశం నిర్వహించారు. 2006లో దేవరపాళెంకు చెందిన బాలు శ్రీనివాసులు దగ్గర సర్వే నెం. 238, 239-1, 289లలో ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. విక్రయదారుడు శ్రీనివాసులు మరణించడంతో ఆ ప్లాట్లను దేవరపాళెంకు చెందిన వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశామని, విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా, సదరు భూమి 2002 నుంచి తమ ఆధీనంలోనే ఉందని, ఈ వివాదమై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని, తదుపరి తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తే వారే భూమిని పొందవచ్చని వేమిరెడ్డి ఆనంద్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందచేస్తున్న దాతలు

నెల్లూరు రూరల్, మార్చి 5 : మండలం లోని సౌత్‌మోపూరు గ్రామంలో గల వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వావిలేటిపాడుకు చెందిన ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ పరీక్ష సామగ్రిని అందజే సింది. ఆ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడేలా మెటీరియల్‌ను అందచేశారు. అతిథిగా పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఏఏఎఫ్ అధినేత మస్తానయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చదువుకుంటేనే జీవితం బాగుంటుందని చెప్పారు. పేదరిక నిర్మూలనకు చదువు ఒక్కటే మార్గమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని పిలుపునిచ్చారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల మొదట స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 5 వేలు, రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ. 3 వేలు, మూడో స్థానం సాధించిన వారికి రూ. 2 వేలు ప్రోత్సాహక బహుమతులను ఏఏఎఫ్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీల ద్వారా అందచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం అన్వర్‌హుస్సేన్, శివాజీ యూత్ ఫౌండేషన్ అధినేత మోపూరు భాస్కర్‌నాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధినేత కుంచాల విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి నేడు పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి బుధవారం పుష్పయాగం జరగనుంది. దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం 6గంటలకు పుష్పయాగం నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



నెల్లూరు(హరనాథపురం), మార్చి 5 : నగరంలోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి చేనేత కాటన్, సిల్క్ ఎక్స్‌పో వారి వస్త్ర ప్రదర్శన ఆకట్టు కుంటోంది. ఈనెల 14వ తేదీ వరకు, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఇందులో పోచంపల్లి, మంగళగిరి, చీరాల శారీస్ డ్రస్ మెటీరియల్స్‌తో పాటు కొండపల్లి, ఏటికొప్పాక చెక్కబొమ్మలు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, పూజా సామగ్రి తదితరాల అమ్మకాలు జరుగుతున్నాయి.

నెల్లూరు రూరల్ టీడీపీలో చేరికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), మార్చి 5: నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన చిక్కరాల హరీష్, ఆయన మిత్రబృందం మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రధానంగా వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10కి 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలను టీడీపీ, జనసేన కూటమి కైవశం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పముజుల ప్రదీప్, రాపూరు శేఖర్, అన్నం సుధాకర్‌గౌడ్, తాళ్లూరు రామయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గం 34వ డివిజన్‌లోని జడ్పీ కాలనీ, జేవీఆర్ కాలనీ, సుజాతమ్మ కాలనీ, ఆదర్శనగర్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మార్జిన్.. మాయం!

- నెల్లూరు నగరంలో రోడ్ల ఆక్రమణలు
- మొదట ఆక్రమణ.. ఆపై దుకాణాల నిర్మాణం
- అద్దె వసూలు చేస్తున్న రాజకీయ నాయకులు
- ముడుపులతో మిన్నకుండిపోతున్న అధికారులు
- అన్యాక్రాంతమవుతున్న సర్కారు ఆస్తులు

ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట రోడ్డు పైనే కాఫీ దుకాణం



ప్రభుత్వ స్థలాలను రాబందుల్లా తన్నుకుపోతున్న ఆక్రమణదారులు రహదారులనూ వదలడం లేదు. బహిరంగంగానే కబ్జా చేసేసి నిర్మాణాలతో వాణిజ్య సముదాయాలుగా మార్చేస్తున్నారు. ఆక్రమణ సమయంలో హడావుడి చేసి ముడుపులు తీసుకుంటున్న అధికారులు ఆపై చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు ఆక్రమిత స్థలాల్లో దుకాణాలకు నెలావారి అద్దె తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. నెల్లూరు నగరంలో నానాటికి పెచ్చుమీరుతున్న రహదారుల ఆక్రమణలు భవిష్యత్ అవసరాలు ఆందోళనకరంగా మారనున్నాయి.

నెల్లూరు (సిటీ), మార్చి 5 : నెల్లూరులోని జీఎన్‌టీ రహదారి పెద్దాసుపత్రి వద్ద ఓ వ్యక్తి వంద అంకణాలకుపైగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి మొక్కల వ్యాపారం చేస్తున్నారు. ఈ ఆక్రమణ కళ్లకు కనిపిస్తున్నా ఏ ఒక్క అధికారీ నోరుమెదపకపోవడం గమనార్హం. కబ్జా సమయంలో అధికార యంత్రానికి మామూళ్లు చెల్లించుకున్న ఈ ఆక్రమణదారుడు తాజాగా రాజకీయ నాయకులకు నెల అద్దెగా రూ.4 వేల వరకు ముడుపులు చెల్లించుకుంటున్నారు.

● నెల్లూరు - ముత్తుకూరు రహదారి నారాయణ హస్పిటల్ మలుపు వడ్డిపాళెం సెంటరు వద్ద మరో వ్యక్తి రహదారికి ఆనుకుని ఉన్న పంట కాలువపై దుకాణాన్ని నిర్మించేశాడు. ఇరిగేషన్ అధికారులు తొలిమలి హెచ్చరించి వారికి అందాల్సిన ఫలితం అందడంతో మిన్నకుండిపోయారు. తాజాగా ఈ ప్రాంతంలోని ఓ నాయకుడికి కప్పం కడుతూ దుకాణాన్ని నిర్వహించుకుంటున్నారు.

● మినీ బైపాస్ రోడ్డు టీడీపీ కార్యాలయం నుంచి అన్నమయ్య సర్కిల్ వద్ద రహదారిని ఆక్రమించేసిన వ్యాపారులు యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరి వద్ద కొందరు అధికారులు నెలావారి మామూళ్లు తీసుకుంటున్నట్లు సమాచారం.

● అన్నమయ్య సర్కిల్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించేసిన ఓ వ్యక్తి ఏకంగా విజయ డెయిరీ ఉత్పత్తులను విక్రయించే ఓ పార్లర్ నిర్మించేశారు. ఈ మార్గం గుండా నిత్యం ఉన్నతాధికారులు అనేక మంది వస్తు, వెళ్తుంటారు. కానీ ఈ పార్లర్‌కు అధికార పార్టీ అండదండలు ఉండటంతో ఎవరు ప్రశ్నించలేకున్నారంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి పరిశీలన

● ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట రహదారి స్థలాన్ని ఆక్రమించేసిన మరో వ్యక్తి కాఫీ దుకాణాన్ని నిర్మించాడు. ఇందుకుగాను పక్కనే ఉన్న కల్యాణ మండపం యజమాని ఈ దుకాణం నుంచి నెల అద్దె సుమారు రూ.5వేలు వసూలు చేయడం ఆశ్చర్యకరంగా మారింది. పొదలకూరు రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాల నుంచి రూ.వెయ్యి వంతున వసూలు చేస్తున్నారు.

● నెలనెల మామూళ్లతో సరి

రాజకీయ నాయకులతోపాటు పలు శాఖల అధికారులు పోటీపడి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. నెల్లూరులో రహదారుల ఆక్రమణ వీరికి కాసులు కురిపిస్తోంది. దుకాణాల నిర్మాణంలో తొలుత అభ్యంతరాలు చెప్తున్న పలు శాఖల అధికారులు ఆపై ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో అధికారులపై ఒత్తిడి తెస్తూ కబ్జాదారులకు కాపలా ఉంటున్న కొంతమంది నాయకులు, స్థానిక కార్పోరేటర్లు దుకాణదారుల వద్ద నెల మామూళ్లు పొందుతున్నారు. ఈ ఆక్రమణల పరంపరా ఇలాగే కొనసాగితే సహజవనరులన్నీ మాయమైపోయ్యే అవకాశంఉందని ప్రజలు వాపోతున్నారు.

సోమిరెడ్డితో వీపీఆర్ భేటీ


సోమిరెడ్డిని కలిసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 5: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. నగరంలోని వేదాయపాళెంలో గల సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయానికి మంగళవారం వేమిరెడ్డి వెళ్లారు. ఇద్దరు జిల్లా రాజకీయాలపై చర్చించుకున్నారు. సోమిరెడ్డి నివాసంలో ఉన్న సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు.

వాటర్ కూలర్ వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 : నగరంలోని జర్నలిస్టు భవన్ ప్రెస్‌క్లబ్‌కు సుందర్ హిమ్మత్ సేవా ఫౌండేషన్ వాటర్ కూలర్ వితరణ చేసింది. మంగళవారం ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దినేష్‌జైన్ కూలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, సురేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి నుంచి రక్షణ కల్పించండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 : తన కుమారుడి నుంచి తనకు రక్షణ కల్పించాలని, మనుబోలు గ్రామం, కేఆర్‌పురం, బీసీ కాలనీకి చెందిన ఆశం సురేష్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని జర్నలిస్టు భవన్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, అందరికీ వివాహం చేసినట్లు చెప్పారు. కుమారుడు పెళ్లి తర్వాత అత్తారింటికి ఇల్లరికం వెళ్లాడని, తమ బాగోగులు పట్టించుకోవడం లేదని తెలిపారు. పైగా కొడుకు, కోడలు కలిసి తమ ఇంటిని, స్థలాన్ని ఆక్రమించుకున్నారని వాపోయారు. తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేశాడని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.



ప్రయోగ వేదికపైకి అగ్నికుల్

ప్రైవేట్ రంగంలో రెండో రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోటలోని షార్ సిద్ధమవుతోంది.త్వరలో అగ్నికుల్ రాకెట్‌ను ప్రయోగించనున్న నేపథ్యంలో రాకెట్‌ను షార్‌లోని ఏఎస్ఎల్వీ కాంప్లెక్స్‌లో అనుసంధానం చేశారు. మంగళవారం రాకెట్‌ను ప్రైవేట్ ప్రయోగ వేదికకు తరలించారు. అగ్నికుల్ కాస్మోస్,మద్రాసు ఐఐటీ స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ తరపున సబ్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించి షార్ నుంచి ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నికుల్ ప్రయోగ వాహకనౌకకు అగ్నిబాన్ సబార్బిటల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్‌వోఆర్ టీఈడీ)గా నామకరణం చేశారు. ప్రస్తుతం ప్రయోగ వేదిక రాకెట్‌కు పలు తనిఖీలు జరుగుతున్నాయి. ఇది అగ్నిలెట్ ఇంజన్‌తో నడిచే సింగిల్ స్టేజ్ వాహక నౌక. ఈ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను పూర్తిగా 3డీ సాంకేతికతతో రూపొందించారు. 6కేఎన్ సామర్థ్యాన్ని కలిగిన ఈ రాకెట్‌లో 300 కిలోల పేలోడ్‌తో 700 కిలోమీటర్ల దూరంలో పంపే విధంగా డిజైన్ చేశారు. షార్‌లో అగ్నికుల్‌కు చెందిన సొంత ప్రయోగ వేదిక, మిషన్ కంట్రోల్ సెంటర్‌ను గత ఏడాది ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

- సూళ్లూరుపేట

పొగమంచులో శేషాచలం

వేసవి ప్రారంభ నేపథ్యంలో దేశమంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతుంటే తిరుమల శేషాచల కొండలు మాత్రం దట్టమైన పొగమంచుతో కనువిందు చేస్తున్నాయి.మంగళవారం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికులు ఈ దృశ్యాలను ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





బిల్లులు చెల్లిస్తేనే సచివాలయంలోకి...!


తనకు బిల్లులు చెల్లించే వరకు సచివాలయంలోకి వెళ్లడానికి వీల్లేదంటూ కేవీబీపురం మండలం ఓళ్లూరు సర్పంచ్ సురేష్ సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులు, వార్డు మెంబర్లతో కలిసి మంగళవారం ఉదయం సచివాలయానికి వచ్చిన సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా డోరు వద్ద అడ్డంగా బైఠాయించారు. ఈ విషయం తెలుసకున్న పోలీసులు, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ దయాసాగర్ సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. గతంలో చేసిన రెండు మోటారు పనులకు రూ.6లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అలాగే ప్రస్తుతం మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయించేందుకు సైతం బిల్లులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు.తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు.తాను టీడీపీ సర్పంచ్ కావడంతోనే ఎంబుక్ బిల్లు పెట్టడం లేదని సర్పంచ్ ఆరోపించారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు.

- కేవీబీపురం

రంగులు మారుతున్న నగరి రాజకీయం

వాతావరణ మార్పులతో మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతుండగా, అంతకంటే ఎక్కువగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకమునుపే నగరి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. టీడీపీతో దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకున్న సిద్ధార్థ కళాశాలల చైర్మన్, టీడీపీ నాయకుడు అశోక్‌రాజు మంగళవారం కమలం గూటికి చేరారు. కొంత కాలం నుంచి మంత్రి రోజాపై అస్త్రాలు ఎక్కుపెట్టిన అసమ్మతి నాయకులు అమీతుమీకి సిద్ధమవుతున్నారు.ఈ నేపథ్యంలో మంత్రి రోజా తెరవెనుక రాజకీయాలను ప్రారంభించారు. వరుస పెట్టి సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. నగరికి చెందిన మరో అసమ్మతి నాయకుడు కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌ను కలిశారు.

- పుత్తూరు అర్బన్



కాషాయం కండువా కప్పుకున్న అశోక్‌రాజు

నిన్నటి వరకు పసుపు కండువాను ధరించిన అశోక్‌రాజు మెడలో కాషాయం చేరింది. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసి, ఆయనకు సన్నిహితుడిగా ముద్రపడిన అశోక్‌రాజు మంగళవారం ఉదయం విజయవాడలో బీజేపీ చీఫ్ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల అనంతరం గుంభనంగా ఉన్న ఆయన వారం క్రితం టీడీపీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేశానంటూ తనపై దుష్ప్రచారం చేశారని రాజీనామా సందర్భంగా మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అశోక్ రాజు రాజీనామా తాము ముందు నుంచి ఊహించిందేనని, దీని వల్ల కలిగే నష్టం ఏమీలేదని టీడీపీ వర్గాలు తేల్చేస్తున్నాయి.



ఎక్కుపెట్టిన విల్లు దింపని అసమ్మతి

మంత్రి రోజాపై అసమ్మతి నాయకులు ఎక్కుపెట్టిన విల్లు ఇప్పట్లో దింపేలా కనిపించడం లేదు. వారం రోజులుగా మంత్రి రోజా,వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి మధ్య కొనసాగుతున్న పోరు మంగళవారం కొత్త రూపు సంతరించుకుంది. నగరిలో జరిగిన వైసీపీ నాయకుల సమావేశంలో మంత్రి రోజా భర్త సెల్వమణి అసమ్మతి నాయకులపై చేసిన కామెంట్ నిప్పు రాజేసింది. దీంతో పుత్తూరు నుంచి మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి సోదరుడు, నింద్ర ఎంపీటీసీ రెడ్డివారి భాస్కర రెడ్డి, విజయపురం సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన మరో సీనియర్ నాయకుడు రవిశేఖర్‌రాజు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ మంత్రి రోజా, ఆమె సోదరులు ఈ ఐదేళ్లలో నియోజకవర్గం కేంద్రంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే తాము ఈ దఫా ఆమెకు ఎట్టిపరిస్థితుల్లోను పనిచేయబోమని కూడా తేల్చి చెప్పేశారు. ఏలుమలై మొదలియార్ తమ రెక్కల కష్టంతోనే రెండుసార్లు రోజా ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. గత ఎన్నికల మునుపు విజయపురంలోని తన ఇంట్లో జరిగిన సమావేశంలో మంత్రి రోజా దంపతులు తమను నమ్మించి ఎన్నికల తరువాత మోసం చేశారని లక్ష్మీపతిరాజు, రవిశేఖర్‌రాజు ధ్వజమెత్తారు. విజయపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో 50 శాతం వాటా మంత్రి రోజా సోదరులకు ముట్టిందని ఆరోపించారు.ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న వ్యతిరేకతను గుర్తించకుండా అధిష్ఠానం మళ్లీ రోజాకు టికెట్ ఇస్తే ఆమె ఓటమికి తాము బాధ్యులు కాబోమని, ఆమెకు తప్ప వేరే ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి, రెడ్డివారి భాస్కరరెడ్డి అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి రోజా, ఆమె కుటుంబంపై ఐదు మండలాలకు చెందిన బలమైన నాయకులు తొలిసారిగా మీడియా ముందుకు వచ్చి బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం వైసీపీ శ్రేణుల్లో అలజడి సృష్టించింది.

రాజకీయ భేటీలతో మంత్రి బిజీ

రాజకీయ సమావేశాలతో మంత్రి రోజా బిజీ బిజీగా గడుపుతున్నారు. మండలాల నుంచి వైసీపీ నాయకులను నగరిలోని తన కార్యాలయానికి పిలిపించుకుని చర్చిస్తున్నారు. ఇటీవల పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల సభ నగరిలో విజయవంతం కావడంతో రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓట్లలో చీలిక రానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో అసమ్మతి నాయకుల ప్రభావం కూడా ఈ దఫా స్పష్టంగా ఉండనుందనే వాదనలున్నాయి. దీంతో నష్టనివారణ చర్యలకు దిగిన రోజా తన అనుకూల నాయకులతో పాటు ప్రధానంగా కులసమీకరణాలకు ప్రాధాన్యత నిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కోరోజు ఒక్కో మండలం నుంచి ఒక ప్రధాన కులంతో సమావేశమై వారి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. 2019లో సమరోత్సాహంతో ఎన్నికలను ఎదుర్కొన్న వైసీపీ క్యాడర్ ఈ ఐదేళ్లలో మారిన సమీకరణాలు, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తలెత్తిన అసంతృప్తి, వరుసగా పార్టీలో జరుగుతున్న సంఘటనలతో మునుపటి ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోతున్నాయనే ప్రచారం పొలిటికల్ సర్కిల్స్‌లో పెరుగుతోంది.

సీఎంతో కేజే దంపతుల భేటీ

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి, మాజీ మున్సిపల్ చైర్మన్ కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో మంత్రి రోజా రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొట్టమొదట బయటకు వచ్చింది కేజే కుమార్ దంపతులే. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. రోజా అభ్యర్థిత్వాన్ని కేజే కుమార్ దంపతులు తొలినుంచీ తీవ్రంగా విభేదిస్తున్నారు. సీఎంను కలిసిన కేజే కుమార్ దంపతులు భేటీ తరువాత నిరాశతో వెనుదిరిగినట్లు సమాచారం.



కలెక్టర్ లక్ష్మీశతో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- భక్తుల భద్రతకు ప్రాధాన్యం
- ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5: సమగ్ర ప్రణాళిక రూపొందించి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ తెలిపారు. మంగళవారం వేకువ జామునే తిరుపతికి చేరుకున్న ఆయన తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపి.. శాంతి భద్రతలకు పెద్ద పీట వేస్తామన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వచ్చే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, శ్రీసిటీ పారిశ్రామికవాడ ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం అధికారులు, సిబ్బంది ఒక టీమ్‌గా పనిచేస్తామని వివరించారు. వీటన్నింటితో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులు నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.అనంతరం కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు.

నా కష్టానికి ఫలితం దక్కింది

వినుకొండ సుబ్రమణ్యం



డోలు సంగీత వాయిద్యాన్ని కష్టపడి నేర్చుకున్న తాను కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని వినుకొండ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు.ఓ చిన్న గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తాను 11వ సంవత్సరం నుంచే డోలు మీద సాధన చేశానన్న సుబ్రమణ్యంతో సంభాషణ...

? స్ఫూర్తి

! అమ్మానాన్నలు వినుకొండ కృష్ణయ్య, సుబ్బమ్మ నాకు ఆదర్శం.ఏదోఒక వృత్తి విద్యలో రాణించాలని వారు చెప్పిన మాటలే స్ఫూర్తి.

? డోలు వాద్యంపై మక్కువ

! చిన్నతనం నుంచే డోలు వాద్యంపై ఎక్కువగా ఆసక్తి ఉండేది.ఆ ఆసక్తి ఇష్టంగా మారడంతో కష్టపడి సాధన చేశా.తిరుపతిలోని బసవయ్య, రాజగోపాల్ వద్ద 10 సంవత్సరాలు శిక్షణ పొందా.

? కచేరీల మాట

! దేశవ్యాప్తంగా 400కు పైగా కచేరీల్లో పాల్గొన్నా. ప్రముఖ నాదస్వర విద్వాంసుడు ఏకేసీ నటరాజన్‌తో కలిసి పలు కచేరీల్లోనూ, షేక్ యాకబ్‌సాహెబ్, బడేసాహెబ్ నాదస్వరంతో కలిసి విజయవాడలోని ఆలిండియా రేడియోలో కార్యక్రమంలో పాల్గొన్నా.అంతేకాదు ఢిల్లీలో నేషనల్ ప్రోగ్రాం మ్యూజిక్ ఆడిషన్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించా.

? శిక్షణ

! ఈ విద్యను విస్తరించాలన్న ఉద్దేశంతో డబ్బులు తీసుకోకుండా 300 మందికి పైగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించా.

- గూడూరు



తిరుమలలో నాదనీరాజనం వేదికపై వినుకొండ సుబ్రమణ్యం

శివరాత్రి ఉత్సవాల్లో భూతరాత్రి ఏకాంతం



ఆలయంలోనే ఆదిదంపతుల ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, మార్చి 5: వాయులింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం జరగాల్సిన భూత రాత్రి మొదటి వాహన సేవ ఏకాంతంగా జరిగింది. మంగళవారం రాత్రి స్వామివారు భూత, అమ్మవారు శుక (చిలుక)వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనం ఇవ్వాల్సి ఉంది. కానీ మాడ వీధుల్లోని నెహ్రూ రోడ్డుకు ఆనుకుని ఉన్న జెట్టిపాలెం సందులో ఒకరు శివైక్యం చెందారు. సంప్రోక్షణకు సమయం సరిపోకపోవడంతో ఆగమ నియమం ప్రకారం భూత వాహన సేవను ఏకాంతంగా మార్చారు.ఆలయం లోపలే ఉత్సవమూర్తులను ప్రదక్షిణ పూర్వకంగా తిప్పి తిరిగి కొలువుదీర్చారు.మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖరుడి రాజసం, చప్పరంపై జ్ఞానాంబిక అమ్మవారి వైభవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు.

శ్రీవారి సెంటిమెంట్‌తో టికెట్ కోసం...

చంద్రబాబుకు నరసింహయాదవ్ లేఖ



తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవుల కోసం, అవకాశాల కోసం నేతలు రకరకాల మార్గాలు ఎంచుకోవడం పరిపాటి.తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ కూడా తిరుపతి టీడీపీ టికెట్ కోసం శ్రీవారి సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొచ్చారు. తిరుమలలో శ్రీవారు యాదవులకు తొలి దర్శన భాగ్యం కల్పించారని... అలాగే తిరుపతిలో ఎమ్మెల్యేగా యాదవులకు తొలిసారి అవకాశం కల్పించాలంటూ అధినేత చంద్రబాబును అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన ఓ లేఖను మంగళగిరిలో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సు వేదికపై చంద్రబాబుకు అందజేశారు. తిరుమల, తిరుపతిలకు చెందిన యాదవులతో వెంకటేశ్వర స్వామికి బంధం వుందని పేర్కొన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన తనకు తిరుపతి అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వున్న యాదవ సామాజికవర్గానికి తెలుగుదేశం పార్టీపై అభిమానం మరింత పెరిగే పరిస్థితి వుంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా తిరుపతి టీడీపీలో కొనసాగుతున్న నరసింహయాదవ్ బీసీ కోటాలో అసెంబ్లీ టికెట్ కోసం గత ఎన్నికల్లోనూ గట్టిగా యత్నించారు. టికెట్ దక్కకపోయినా తుడా చైర్మన్ పదవి లభించింది. తర్వాత పార్లమెంటు పార్టీ అధ్యక్ష పదవి కూడా దక్కింది. రానున్న ఎన్నికల్లో కూడా టికెట్ కోసం రేసులో వున్న నరసింహ యాదవ్ పార్టీ జయహో బీసీ సదస్సులో ఈ మేరకు లేఖ అందజేసి అధినేత దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించారు.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

సమ్మర్ స్టోరేజ్‌లో తగ్గిన నీటి సామర్థ్యం ● వేసవి ప్రణాళిక లేకపోతే మరిన్ని ఇబ్బందులు

సూళ్లూరుపేట, మార్చి 5: వేసవి ముందే ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరగనున్న నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో వేసవికి ముందే తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన నీటి పథకాలు సక్రమంగా పనిచేయకపోవడంతో గుక్కెడు నీటికి ఇబ్బందులు తప్పడంలేదు. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి ప్రజలు తాగునీటి ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్నారు. మార్చిలోనే ఇలావుంటే ఏప్రిల్, మే మాసాల్లో మరింత తాగునీటి ఎద్దడి తప్పదని జనం ఆందోళన చెందుతున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో మొత్తం 25 వార్డులుండగా, 58 వేల పైబడి జనాభా ఉంది. పిండిపాలెం వద్ద సమ్మర్ స్టోరేజ్ నుంచి పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. అదేవిధంగా తల్లంపాడు చెరువు నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వేసకి ముందే పిండిపాలెంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌లో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో పట్టణవాసులకు సక్రమంగా తాగునీరు అందడం లేదు. అదే విధంగా తల్లంపాడు చెరువు నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని అందిస్తున్న పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎస్ఎస్ ట్యాంకు పక్కనే ఉన్న నెర్రికాలువ నుంచి నీటిని తోడుకోవాల్సి ఉంది. అక్కడ మోటార్లు తరచు మరమ్మతులకు గురై మొరాయిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు



ఎస్ఎస్ ట్యాంక్‌లో తక్కువగా ఉన్న నీటి నిల్వలు

చేపట్టడం లేదు. కుళాయిల్లో నీరు రాకపోవడంతో పట్టణ ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద క్యాన్ రూ.10 వెచ్చించి కొనుక్కొంటున్నారు. అధికారులు స్పందించి వేసవి ప్రణాళిక రూపొందించకపోతే నీటి ఎద్దడి తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వైసీపీ పాలనతో రాష్ట్రం అధోగతిపాలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

గూడూరు, మార్చి 5: వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనతో రాష్ట్రం అధోగతిపాలయ్యిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక తూర్పువీధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. నిత్యావసరాల వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గాడితప్పిన పాలనను సరిచేయాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువత కోసం చంద్రబాబు నాయుడు పలు సంక్షేమ పథకాలను అమలు పరుస్తారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బత్తిన సుధాకర్, పూర్ణచంద్రరావు, రవీంద్రరెడ్డి, జనార్దనరెడ్డి, నసింహులు నాయుడు, సుబ్బయ్య, సునీల్, దయాకర్, ప్రణీత్, చంద్రమౌళి, భారతి, కల్పన, అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ గెలుపునకు సమష్టి కృషి



కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్, జనసేన నాయకులు

నాయుడుపేట టౌన్, మార్చి 5: సూళ్లూరుపేట నియోజవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ గెలుపు కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ మీడియా వర్క్‌షాపులో టీఎన్ఎస్ఎఫ్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయశ్రీ గెలుపు కోసం సాంకేతికను ఉపయోగించుకొని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు నెలవల రాజేష్, అవధానం సుధీర్, గోపాలకృష్ణ, మధు, శీనివాసులు, హేమంత్, చైతన్య, అంకయ్య, మోహన్‌నాయుడు, సురేష్, పరసా రాజా, జనసేన నాయకులు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరిటౌన్, మార్చి 5: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయ కర్త ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వెంకటగిరిలో బీజేపీని గెలిపిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

రాంకుమార్ రెడ్డికి అండగా నిలవండి

బాలాయపల్లి, మార్చి 5: వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్ రెడ్డికి అండగా ఉండాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సంగవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసీపీ నేత సంజీవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఊట్లపల్లిలో అమీర్ బాషా, భైరవరం మస్తాన్ నాయుడు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఆయా గ్రామాల్లోని నాయకులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడికి అండగా నిలిచి గెలిపించాలని కోరారు. ఆమె వెంట వైసీపీ మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, శ్రీరాములు ఉన్నారు.

ఉచ్చూరు భీమేశ్వరాలయ ఆర్చి ప్రారంభం

దొరవారిసత్రం, మార్చి 5: దొరవారిసత్రం మండలం ఉచ్చూరులోని భీమేశ్వరాలయానికి నూతనంగా నిర్మించిన ముఖద్వారం(ఆర్చి)ను మంగళవారం తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకరరెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుమ్మిడిపూడి నరసింహులు రూ.2 లక్షల వ్యయంతో ఈ ఆర్చి నిర్మించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పామంజి శ్రీనివాసులు, దాత నరసింహులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మార్చి 5: స్థానిక త్యాగరాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

తడ, మార్చి 5: వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రామాపురం కుప్పం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... సోమవారం అర్ధరాత్రి ఓ మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలు వయస్సు 60నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆమెకు సంబంధించి ఎటువంటి ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దొరవారిసత్రం, మార్చి 5: దొరవారిసత్రంలోని ఏకొల్లు క్రాస్‌రోడ్డు వద్ద మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కృష్ణాపురం గ్రామానికి చెందిన తుమ్మూరు పుల్లయ్యపై కేసున మోదు చేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: పాశిం



ప్రచారం నిర్వహిస్తున్న పాశిం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు

చిల్లకూరు, మార్చి 5: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబు నాయుడు ఒక్కడేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగవరం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని మరచి దోచుకోవడం దాచుకోడమే పనిగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను విడుదల చేశారన్నారు. రానున్న ఎన్నికలో టీడీపీని గెలిపించాలని కోరారు. లింగవరం పంచాయతీలోని పల్లెవానిదిబ్బ గ్రామంలో వైసీపీకి చెందిన సుమారు 50 కుటుంబాల వారు యల్లసిరి కోటయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి సునీల్‌కుమార్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, బిల్లు చెంచు రామయ్య, నెల్లటూరు చిరంజీవి, మూగ శంకరయ్య, కరిముల్లా, ప్రవీణ్‌రెడ్డి, అన్నం మునిశేఖర్‌గౌడ్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై అవగాహన పెంచుకోండి

చిల్లకూరు, మార్చి 5: రైతులు కొత్తరకం వంగడాల సాగుపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి భవానీ అన్నారు. మంగళవారం స్థానిక రైతు సుబ్బారావు సాగు చేస్తున్న అన్నపూర్ణ 93 రకం వరి పంటను ఆమె పరిశీలించారు. తక్కువ మోతాదులో పురుగు మందుల వాడకంతో పాటు ఖర్చు తగ్గి అధిక దిగుబడులు ఇచ్చే కొత్త వంగడాలను సాగుచేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఆమె వెంట సిబ్బంది శివకుమార్, రైతులు శివారెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపండి

కోట, మార్చి 5: ప్రకృతి వ్యవసాయంపై సన్న, చిన్నకారు రైతులు మక్కువచూపేలా చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ రవిచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు, వైఎస్సార్ క్రాంతిపథం ప్రతినిధులతో సమీక్ష జరిగింది. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధుల విధులు, వేతనాలకు సంబంధించి ఇక నుంచి సెర్ప్‌కు అప్పగించడంతో అందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను ఏపీఎం రత్నయ్య, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి రవిచంద్రప్రసాద్ మార్చుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, రాంబాబు, రోషిణి పాల్గొన్నారు.

మల్లెపూల సాగు విస్తీర్ణం పెంచండి

కోట, మార్చి 5: మెట్ట ప్రాంతాల్లో మల్లె పూల సాగు విస్తీర్ణం పెంచాలని హార్టికల్చర్ అధికారి కార్తీక్ కోరారు. మండల పరిధిలోని కేశవరంలో మంగళవారం బాల్ రక్షాభారత్ సేవ్ ది చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మల్లెపూల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మల్లెల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ విధానాలు, సాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలపై మహిళా రైతులకు మూడు రోజులపాటు జరిగే శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో సేవ్‌దిచిల్డ్రన్ సూపర్ వైజర్ పాపారావు, రమణయ్య, సర్పంచు గురుస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, పశుసంవర్ధక అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 5: స్థానిక త్యాగరాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, రేణుక, మల్లిక, విష్ణువందన, శశిరేఖ, జమున, స్నేహలత, లక్ష్మి, జానా సుధీర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించండి

కోట, మార్చి 5: మండల పరిధిలోని చెందోడు పంచాయతీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమికి అన్యాక్రాంతమైందని, ఆ భూమికి రక్షణ కల్పించాలంటూ మంగళవారం స్థానిక దళితవాడవాసులు డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం అందజేశారు. తమ దళితవాడ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకున్నామని, అయితే స్థానికంగా ఉన్న కొంత మంది ఆ భూమిని ఆక్రమించుకొని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పారు.

వెంకయ్య నాయుడికి స్వాగతం



వెంకయ్య నాయుడికి స్వాగతం పలుకుతున్న ఆర్డీవో

గూడూరు. మార్చి 5: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు గూడూరు రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. రేణిగుంట నుంచి నారాణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో గూడూరుకు చేరుకున్న వెంకయ్య నాయుడు అక్కడి నుంచి కారులో వెంకటాచలానికి బయలుదేరి వెళ్లారు. ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఆర్డీవో కిరణ్ కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, బిందురెడ్డి, శ్రీనవావాసరావు తదితరులు ఉన్నారు.

తెలుగుగంగ నీరు విడుదల

పెళ్లకూరు, మార్చి 5: నియోజకవర్గంలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగుగంగ నీటిని విడుదల చేసినట్లు ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. తొట్టంబేడు మండలం రాంబొట్లపల్లి వద్ద ఉన్న తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి 7వ బ్రాంచి కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఉన్న వరి పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేశామని, తద్వారా చెంబేడు, పునబాక, నందిమాల, అర్ధమాల, చెన్నప్పనాయుడుపేట, రోసనూరు తదితర గామాల్లో సుమారు 4వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందన్నారు. రైతుల ఈ నీటిని సద్వినియోగం చేసకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లు మోహన్, అట్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు

చిల్లకూరు, మార్చి 5: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో టెంకాయల విక్రయాలు, పొలం సాగుకు సంబంధించి మంగళవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఏడాది పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు రూ.55వేలు, 25 ఎకరాల పొలాన్ని ఐదేళ్ల పాటు సాగు చేసుకునేందుకు ఏడాదికి రూ.3.29లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, నల్లయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో జాతరకు సంబంధించి వేలంపాట నిర్వహించగా టెంకాయలు విక్రయానికి రూ.7లక్షలు, ఈదలవారిపాళెం వైపు పార్కింగ్‌కు రూ.31వేలు, సిద్దవరం వైపు పార్కింగ్‌కు రూ.30వేల ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.

టీడీపీ నేతకు సన్మానం



రమణారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 5: టీడీపీ నాయకుడు కట్టా రమణారెడ్డిని ఆ పార్టీ నాయకులు సన్మానించారు. ఇటీవల రమణారెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహానికి చేరుకొన్న టీడీపీ నాయకులు రమణారెడ్డికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, పరుశురామ్, ఓజిలి శీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాఠశాల అటెండర్ మృతి



రమణమ్మ మృతదేహం

దొరవారిసత్రం, మార్చి 5: దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాళెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మించల రమణమ్మ(34) మృతి చెందింది. మండలంలోని అక్కరపాక గ్రామానికి చెందిన రమణమ్మ పూలతోట జడ్పీహైస్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తోంది. సమీప బంధువు మేకల మల్లికార్జున్‌తో కలిసి సూళ్లూరుపేటకు మోటారు సైకిల్‌పై వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పోలిరెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద మరో మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున్ స్వల్ప గాయాలతో బయటపడగా, రమణమ్మ తలకు బలమైన రక్త గాయమైంది. ఆమెకు నాయుడుపేటలో ప్రాథమిక చికిత్స అందించి నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మృతదేహానికి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

దొరవారిసత్రం, మార్చి 5: ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.... దొరవారిసత్రం మండలం తనియాలి కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన అద్దూరు నాగలక్ష్మి(19) కుటుంబ కలహాలతో గత నెల 25వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నాగలక్ష్మికి ఐదేళ్ల క్రితం మునిశేఖర్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

కోట, మార్చి 5: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ, ప్రజావేదిక జరిగింది. కోట మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.5.32 కోట్లతో పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఏపీడీ వరప్రసాద్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేపట్టి ప్రజావేదిక నిర్వహించారు. రూ.4.85 కోట్లు కూలీలకు వేతనాల కింద చెల్లించగా, రూ.46,684 మెటీరియల్ కోసం ఖర్చు చేశారు. కొన్ని పనులకు నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగకపోవడంతో సిబ్బందిపై పీడీ శ్రీనివాసప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రసహాయకులు, టెక్నికల్ సిబ్బంది నుంచి రూ.1.98 లక్షల రికవరీకి ఆదేశించారు. పలువురు పనితీరు బాగాలేదంటూ అసహనం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు ఇస్తానంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, ఏపీవో పూర్ణిమ, ఎస్ఆర్పీ తిరుమలేషు పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించండి

వాకాడు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీ బహిరంగసభ జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7.11 కోట్ల చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించాయి. రూ.26,500 రికవరీకి ఆదేశించారు. రూ 8,378 జరిమానా విధించారు. రావిగుంటపాళెం పంచాయతీ మినహా మిగిలిన పంచాయతీల్లో కూలీలకు 100 రోజుల పని కల్పించడంలేదని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఎంపీడీవో గోపీనాథ్, ఏపీవో విజయ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి వచ్చేలా చూడండి

చిల్లకూరు, మార్చి 5: ఉపాధి కూలీలను గిట్టుబాటు కూలి రూ.272 వచ్చేలా పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కడివేడు గ్రామంలోని మినీ అమృత్ సరోవర్ పనులను ఆయన పరిశీలించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు పనుల వద్ద అన్ని వసతులను కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి రోజాకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

వైసీపీ అధిష్ఠానానికి నగరి వైసీపీ నేతల అల్టిమేటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: మంత్రి రోజాకు నగరి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని నియోజకవర్గ వైసీపీ నాయకులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డితో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు రెడ్డివారి భాస్కర రెడ్డి, ఏలుమలై, రవి, శేఖర్‌రాజు,వాసుదేవరెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్ రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రోజాను గెలిపించడానికి ఆస్తులమ్ముకుని కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. తనకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభలో ఊదరగొట్టిన రోజా ఇపుడు తమనే ఇబ్బందులపాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి పాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్‌లెగ్‌గా పేరు పొందిన రోజాను గోల్డెన్‌లెగ్‌గా మార్చి 2014లో ఎమ్మెల్యేని చేశామన్నారు.నగరి నియోజకవర్గాన్ని తన అక్రమార్జనకు అడ్డాగా చేసుకున్న మంత్రి రోజా తమను పక్కకు నెట్టేసిందన్నారు. నగరి ప్రజలు ఆమె పట్ల సానుకూలంగా లేరన్నారు. వైసీపీ అధిష్ఠానం ప్రజాభీష్టంతో పాటు క్యాడర్ విజ్ఞప్తిని మన్నించి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇతరులకు కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. అలాకాదని రోజాకే సీటు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తమపై నిందారోపణలు చేస్తున్న మంత్రి రోజా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

శ్రీసిటీలో టీహెచ్‌కె ప్లాంటు విస్తరణకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ, మార్చి 5: లీనియర్ మోషన్‌గైడ్లు, రవాణా వాహనాల సామగ్రి తయారీలో పేరుగాంచిన జపాన్‌కు చెందిన టీహెచ్‌కే కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ టీహెచ్‌కే ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్లాంటు విస్తరణకు మంగళవారం శ్రీసిటీలో భూమిపూజ జరిగింది. టీహెచ్‌కే గ్రూప్‌చైర్మన్, సీఈవో అకిహీరో తెరమాచి అధ్యక్షతన నూతన ప్లాంటు నిర్మాణ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, ఎస్ఎంసీసీ హెచ్‌క్యూ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మిమోరి, ఎండీ షిమిజు, జనరల్ మేనేజర్ వతనాబే, ఇతర పలువురు విశిష్ట అతిథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రూ.300 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న కొత్త ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా మరో 250 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. నవంబరు 2021 నుంచి పనిచేస్తున్న శ్రీసిటీలోని టీహెచ్‌కే ఇండియా ప్రస్తుత ప్లాంటులో ఇప్పటికే దాదాపు 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.